ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
7
శనివారం 26 అక్టోబరు 2024





గిట్టుబాటు గగనం

తెల్ల బంగారం.. తెల్లబోతోంది. సిరులు కురిపించాల్సిన పత్తికి గిట్టుబాటు ధర గగనంగా మారింది. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మీనమేషాలు.. రోజురోజుకు ధర పడిపోవడం.. అప్పులకు వడ్డీల భారం పెరిగిపోతుండటంతో రైతులు అందినకాడికి అమ్మేసుకుంటున్నారు. ఇదే అవకాశంగా దళారులు రైతులను దోచుకుంటున్నారు. పంట చేతికి రాకముందు ఆకాశాన్నంటిన ధరలు, ఇప్పుడు నేలను చూస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ.5 వేల కంటే తక్కువకు పడిపోయింది. తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో దళారులు రైతు నోట్లో మట్టికొడుతున్నారు. పత్తి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7521గా కేంద్రం ప్రకటించింది. రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ, మార్కెటింగ్ శాఖలు చోద్యం చూస్తున్నాయి. పత్తి కోతలు ముమ్మరంగా జరుగుతున్నా ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా సీసీఐ ప్రారంభించలేదు.

- దళారుల చెరలో పత్తి రైతులు
- పెట్టుబడీ రాక రైతులు లబోదిబో
- కొనుగోలు కేంద్రాలపై సీసీఐ మీనమేషాలు
- క్వింటాల్‌కు రూ.5 వేల కంటే తక్కువకే కొనుగోలు

గుంటూరు సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు.. తెగుళ్లను అధిగమించి పండించిన పత్తికి మార్కెట్‌లో ధర తగ్గింది. విపత్తులు దిగుబడిపై దెబ్బకొడితే వ్యాపారులు ధరలు తగ్గించి సాగుదారులను ఆర్థికంగా నష్టప రుస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశా రు. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ముదురు పత్తి చేతికి వస్తుం ది. ప్రభుత్వం క్వింటాకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. పత్తి కోతలు ముమ్మరంగా సాగుతున్నా కేంద్రాల ఏర్పాటు ఆలస్యం అవుతుంది. అప్పులు తీర్చేందుకు రైతులు పంటను తెగనమ్ముకునే పరిస్థితి నెలకొం ది. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు పత్తి ధరను తగ్గించి వేశారు. గ్రామ స్థాయిలోనే వ్యాపారులు కొనుగోళ్లు ఆరంభించారు. గత నెలలో క్వింటా పత్తి రూ 8 వేలు ఉండగా ఇప్పుడు రూ.6,500కు మించడంలేదు. ఇళ్లలో నిల్వ చేసే అవకాశం లేని వారు, అప్పులకు వడ్డీల భారం పెరుగుతుందని కొందరు, ఇంకా ఆగితే ధర మరింత తగ్గుతుందని భయంతో మరికొందరు రైతులు తెగనమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పల్నాడు జిల్లాలో గత వారం పత్తి క్వింటాల్ ధర రూ.5,200 నుంచి రూ.6 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. గుంటూరు జిల్లాలో పత్తి క్వింటాల్ ధర రూ.5400 నుంచి రూ.6 వేలుగా ఉంది. రోజురోజుకూ ఎక్కువ పంట చేతికి వస్తుండటంతో వ్యాపారులు ధరలు బాగా తగ్గించేస్తున్నారు. గుంటూరు, తాడికొండ, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాల, క్రోసూరు, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మార్టూరు, పర్చూరు ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ సీసీఐకి ప్రతిపాదనలు పంపింది, ఇందుకు సంబంధించి కేంద్రాల ఇన్‌చార్జిలను కూడా నియమించింది. అయినా కేంద్రాల ఏర్పాటులో సీసీఐ జాప్యం చేస్తుండటం రైతులను తీవ్రంగా నష్ట పరుస్తోంది.



దిగుబడులు.. ధరలూ తగ్గాయి..

అధిక వర్షాలు పత్తి దిగుబడులను దెబ్బతీశాయి. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి 7 నుంచి 8 క్వింటాళ్లకు పడిపోతున్నదని రైతులు వాపోతున్నారు. పత్తి కోత సమయంలో వర్షాలు కురవడంతో కాయ రాలిపోతోంది. పల్నాడులో ప్రస్తుతం పత్తి తీత ఎక్కువగా జరుగుతుంది. వర్షాల ప్రభావంతో ముందు కాపునకు వచ్చిన చేలల్లోని పంట పూర్తిగా పాడైందని రైతులు చెప్తున్నారు. ఇప్పుడు తీస్తున్న పత్తిలో తేమ 20 శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో వ్యాపారులు ధరను పూర్తిగా తగ్గిస్తున్నారు. ఎండకు ఆరబెట్టినా అదే ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 20,145 హెక్టార్లు, పల్నాడు జిల్లాలో సుమారు 1.5 లక్షల హెక్టార్లలో పత్తి సాగైనట్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అంచనా. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో మార్కెట్‌లో ధర తగ్గిపోతున్నా విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడికి.. రాబడికి పొంతనే లేదు

ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం పత్తి విక్రయాలు చేపడితే రైతులు అప్పుల్లో కూరుకుపోకతప్పదు. పెట్టిన పెట్టుబడికి, వచ్చే రాబడికి పొంతనే లేదు. పత్తి ఎకరా సాగుకు కౌలు రూ.20 వేలు, సాగు ఖర్చులు రూ.10 వేలు, కలుపు, విత్తనాలకు రూ.7400 వరకు పెట్టుబడి అవుతుంది. క్వింటాల్ పత్తి తీసినందుకు రూ.1300 వరకు కూలి కింద పోతుంది. ఎకరానికి సగటున 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం రూ.30 వేలు మాత్రమే చేతికి వస్తుంది. అంటే, రైతుకు ఎకరాకు రూ.7,400 వరకు నష్టం వాటిల్లుతుంది. దీనికి తోడు రైతు కష్టం, అప్పునకు వడ్డీలు కలిపితే నష్టం తడిసి మోపెడవుతుంది. సీసీఐ కేంద్రాలు తెరిస్తే రైతుకు కొంతలో కొంత గిట్టుబాటు అవుతుంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది పత్తికి అనుకూలమైన మద్దతు ధర ప్రకటించినా దానిని అందుకోలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. సీసీఐ కేంద్రాలు తెరిస్తే తమకు కొంత న్యాయం జరుగుతుందని రైతులు అంటున్నారు.

నేరస్తులపై.. నిఘా నేత్రాలు



- రౌడీషీటర్లు, దొంగల కదలికలపై మూడో కన్ను
- ప్రధాన కూడళ్లలో ఫేస్ రికగ్నేషన్ కెమేరాల ఏర్పాటు
- పోలీసు రికార్డుల్లోని ఫొటోల డిజిటలైజేషన్.. మ్యాట్రిక్స్ సంస్థకు అప్లోడ్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దందాలకు పాల్పడే రౌడీషీటర్లు.. లూటీలు చేసే దొంగల కదలికల కట్టడికి పోలీస్‌శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు సిద్ధమైంది. ఫేస్ రికగ్నేషన్(ఎఫ్ఆర్‌సీ) పరిజ్ఞానంతో ముఖాల్ని గుర్తించే అధునాతన సీసీ కెమేరాలతో వారిపై నిఘా వేయబోతుంది. నేరస్తులను గుర్తించడమే కాకుండా పోలీసులను అప్రమత్తం చేసే బహుళ ప్రయోజనాలు ఉన్న కెమేరాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడికక్కడ నేరస్తులు, దొంగలు, రౌడీషీటర్ల కదలికలను కట్టడి చేసేలా మ్యాట్రిక్స్ సంస్థతో గతంలో టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అయితే కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అధునాతన సీసీ కెమేరాలను పర్యవేక్షించే విధానం అమల్లోకి వచ్చే సమయానికి

(మిగతా 8వ పేజీలో..)

మామూళ్ల దౌర్జన్యం!




- రుణం పొందాలంటే డబ్బులు ఇచ్చుకోవాల్సిందే
- ఆర్పీ, యానిమేటర్ల దోపిడీ
- ఒక్కో గ్రూపు నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వసూలు
- పొదుపు రుణాల్లోనూ వాటాకు డిమాండ్
- సమావేశ తీర్మానాలు రాసినందుకూ పైకం చెల్లించాల్సిందే

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): డ్వాక్రా గ్రూపుల మహిళలను మామూళ్ల గద్దలు వేధించుకు తింటు న్నాయి. డ్వాక్రా సంఘాల్లో ఏ చిన్న ప ని జరగాలన్నా చేయి తడపాల్సిన పరి స్థితి ఏర్పడింది. స్వావలంబన కోసం ఇచ్చే రుణాలు మొదలు అత్యవసర పరిస్థితుల్లో తాము దాచుకున్న పొదు పు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా గ్రూపు సభ్యులైన మహిళలు భారీ మొత్తంలో నగదు చె ల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థి తిపై మహిళలు గగ్గోలు పెడుతున్నా ఏమాత్రం వెరవకుండా పట్టణాల్లోని రిసోర్స్‌పర్సన్లు, గ్రామాల్లోని సెర్ప్ యానిమేటర్లు

(మిగతా 8వ పేజీలో..)

రేషన్ పండగ

- దీపావళికి కందిపప్పు, జొన్నలు
- సబ్సిడీపై కందిపప్పు, 3 కేజీల జొన్నలు ఉచితం
- కార్డు లబ్ధిదారులందరికీ అందించేలా ప్రణాళికలు
- రేషన్ అంటే బియ్యంతో సరిపెట్టిన గత వైసీపీ పాలకులు





గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపా వళి పండుగకు రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్‌తో పేదలపై భారాన్ని తగ్గించిన ప్రభుత్వం కందిపప్పు, జొన్నలు సబ్సిడీపై అందించనుంది. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రేషన్ దుకాణాల్లో కనిపించని కందిపప్పు కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ రేషన్‌లో దర్శనమివ్వబోతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 లక్షల 56 వేల తెల్ల రేషన్‌కార్డులు ఉండగా బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్లో మరో రెండున్నర లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తంగా మూడు జిల్లాల పరిధిలోని 17లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు నవంబరు నుంచి రాష్ట్ర ప్రభుత్వం బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు, జొన్నలను రేషన్ ద్వారా అందించనుంది. ఒక్కో రేషన్ కార్డుపై కిలో కందిపప్పు, గరిష్ఠంగా 3 కిలోల వరకు జొన్నలు అందించాలని నిర్ణయించింది. ప్రతి కార్డుదారుడు జొన్నలు ఉచితంగా పొందవచ్చు. కార్డుపై వచ్చే బియ్యంలో ఎన్ని కిలోల బియ్యం వదులు కుంటే అన్ని కిలోలు(3 కిలోల లోపు) బియ్యానికి బదులుగా జొన్నలు అందిస్తారు. కాగా ఇప్పటికే అక్టోబరులో కొన్ని ప్రాంతాల్లో పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు రాగులు అందజేసింది.

మూడేళ్ల తర్వాత కందిపప్పు..

ఐదేళ్ల తర్వాత జొన్నలు

2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వ పాలనలో రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ బియ్యంతోపాటు, పంచదార, కందిపప్పు, పామాయిల్, గోధుమలు, రాగులు, జొన్నలు, గోధుమ పిండి, శనగలు లభించేవి. 2019లో వైసీపీ అధికారం చేపట్టిననాటి నుంచి ఒక్కొక్కటిగా రేషన్ సరుకులన్నీ మాయమైపోయాయి. ఒకానొక దశలో పంచదార కూడా పేదలకు దక్కలేదు. గత ప్రభుత్వం రేషన్ కార్డులను బియ్యం కార్డులుగా మార్చింది. పైపెచ్చు ప్రతి ఏటా క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగలకు ఇచ్చే కానుకలు కూడా పేదలకు ఇవ్వకుండా ఎగవేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే పేదలకు సబ్సిడీ కందిపప్పు, సరుకులు అందించాలని కృషి చేస్తోంది. ఆ ప్రయత్నం ఇప్పటికిగానీ సాకారం కాలేదు.

29 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాసు సిలిండర్ పథకం ఈ నెల 29 నుంచి లాంఛనంగా ప్రారంభం కాబోతోంది. దీనికి సంబంధించి విధివిధానాల రూపకల్పన కూడా పూర్తయింది. ఒకేసారి మూడు సిలిండర్లు ఇవ్వడం కంటే నాలుగు నెలలకు ఒకసారి సిలిండర్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 29న పథకం ప్రారంభమైన రోజు నుంచి ఉచిత సిలిండర్లు అందుబాటులోకి రానున్నాయి. తొలి సిలిండర్‌ను ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 లోపు ఎప్పుడైనా బుక్ చేసుకోవచ్చు. రెండో గ్యాసు సిలిండర్ ఏప్రిల్ 1 నుంచి జూలై 31లోపు, మూడో సిలిండర్‌ను ఆగస్టు 1 నుంచి అక్టోబరు 31లోపు ఎప్పుడైనా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది.


జేసీ భార్గవతేజ



మిర్చియార్డులో మళ్లీ ఐఏఎస్ పాలన

10

- కొత్త పాలకవర్గం నియామకంలో ప్రభుత్వ జాప్యం
- అప్పటివరకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ భార్గవతేజ

శిక్షణకు.. మేము రాము

- పీఎం విశ్వకర్మ సమీక్షలో కలెక్టర్‌కి ఫిర్యాదు
- బ్యాంకర్ల తీరుతో బెంబేలెత్తుతున్న దరఖాస్తుదారులు
- స్టయిఫండ్ ఇచ్చే విషయంలోనూ నిర్లక్ష్యమేనన్న దరఖాస్తుదారులు

గుంటూరు సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకానికి ఉచితంగా అందించాల్సిన దరఖాస్తుకు రూ.150 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారు.. బ్యాంకర్లు రూ.లక్ష రుణానికి హామీ కావాలంటున్నారు.. ఇప్పటికే శిక్షణ ఇచ్చిన వారికి స్టైఫండ్ ఇవ్వలేదు.. శిక్షణకు వచ్చే వారికి స్టైఫండ్ ఇవ్వడంలేదు.. అని అధికారులు, సభ్యులు కలెక్టర్ ఎదుట సమస్యలు ఏకరువు పెట్టారు. స్కిల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, స్కిల్ శిక్షణ సంస్థల అధికారులు, ఉపాధి అవకాశాలు అందించే అంశాలపై కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. బ్యాంకర్ల రుణాలు ఇచ్చేందుకు ష్యూరిటీలు అడుగుతున్నారని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఈ విషయంలో శ్రద్ధ చూపాలని కలెక్టర్ తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారికి ఫోన్ చేసినా రావడం లేదని ట్రైనింగ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ట్రైనింగ్ కేంద్రాలకు బ్యాంకర్లు వచ్చి ష్యూరిటీ అడుగుతున్నారన్నారు. జిల్లా స్థాయి కమిటీలో దరఖాస్తు చేసుకున్న వారి కాంటాక్ట్ నెంబర్లు ఇవ్వడం లేదని తెలిపారు. జిల్లాలో విశ్వకర్మ పథకం వెనుకబడి ఉన్నదని, లబ్ధిదారులకు శిక్షణ సరిగా అందడం లేదని తెలిపారు. తమకు స్టైఫండ్ ఇవ్వలేదని గతంలో ట్రైనింగ్ తీసుకున్న వారు కొత్తగా వచ్చేవారికి చెపుతున్నారని అందువల్ల కొత్త వారు శిక్షణకు రావడం లేదని తెలిపారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి, విశ్వకర్మ పథకం జిల్లా కమిటీ సభ్యులు టి.రామక్రిష్ణ, కుమార్‌చక్ర, జీఎంసీ డీసీ డి.శ్రీనివాస్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పీఎం విశ్వకర్మపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మార్గదర్శకాలు అమలు చేయాలి

ప్రమాదకర రసాయనాలు వినియోగించే పరిశ్రమల నిర్వాహకులు ప్రభుత్వం మార్గదర్శకాల అమలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ), జిల్లా క్రైసిస్ గ్రూప్(డీసీజీ) సమావేశాలు శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగాయి. కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ ఆయా సమావేశాల్లో పాల్గొన్నారు. పరిశ్రమలకు అవసరమైన వివిధ శాఖల అనుమతులు మంజూరులో నిర్లక్ష్యం వహించరాదన్నారు. తెనాలిలో ఏర్పాటు చేసే దాల్ మిల్ క్లస్టర్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. తొమ్మిది క్లెయిమ్స్‌కు సంబంధించి రూ.93,08,261 మంజూరు చేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదించారు. రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే అందించాల్సిన చికిత్సలపై రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వైద్యులతో జిల్లా స్థాయిలోని వైద్యులకు శిక్షణ అందించేలా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా విపత్తు నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మీకుమారి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మంగాదేవి, వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, భూగర్భ జల వనరుల శాఖ డీడీ వందనం, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజాబాబు, డీపీవో సాయికుమార్, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అధికారి మంజు, ఏపీ ఎస్ఎఫ్‌సీ మేనేజర్ అజిత, పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయకుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సుమంత్, ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శివకరణ్, సిక్కి ఆర్ఎం పరిమళ, ఫ్యాప్సీ జిల్లా కోఆర్డినేటర్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా జిలెటిన్ స్టిక్స్ తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్రావు

పిడుగురాళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి జిలెటిన్ స్టిక్స్ (మందుగుండు సామగ్రి)ను అక్రమంగా పల్నాడు ప్రాంతంలో విక్రయించేందుకు అనధికారికంగా తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. పిడుగురాళ్ల సీఐ ఎస్.వెంకట్రావు శుక్రవారం తెలిపిన వివరాల మేరకు పిడుగురాళ్లకు చెందిన వెన్నా రాజశేఖర్‌రెడ్డి (వైసీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్), మిర్యాలగూడకు చెందిన మహ్మద్ ఆసిఫ్‌కు జిలెటిన్ స్టిక్స్ విక్రయించే లైసెన్స్ ఉంది. వీరిరువురు అనధికారికంగా నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన కేతరాజు అంజయ్యకు 200 జిలెటిన్ స్టిక్స్, పిడుగురాళ్లకు చెందిన చంద్రశేఖర అజాద్‌కు, నల్గొండ జిల్లా నకరికల్లు మండలం కొడదల మల్లేష్‌కు అక్రమంగా జిలెటిన్ స్టిక్స్ ఉన్న బాక్స్‌లను విక్రయించారు. మందుగుండు సామగ్రిని అక్రమంగా తరలించడం, లైసెన్సు లేకుండా నిల్వ ఉంచడం, లైసెన్స్ లేకుండా క్వారీల్లో పేల్చటం వంటివి చేస్తుండటంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి గతంలో కొందరిని అరెస్టు చేయగా, శుక్రవారం మహ్మద్ ఆసిఫ్, కొడదల మల్లేష్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి ద్విచక్ర వాహనాలు, అక్రమంగా మందుగుండు తరలించే మినీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శివనాగరాజు, సిబ్బంది ఉన్నారు.

డిప్యుటేషన్ నిబంధనలకు తూట్లు

- డైట్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఉపాధ్యాయులు
- పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గుంటూరు (విద్య) అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శిక్షణ కోసం నిర్వహించే డైట్ సెట్‌లో ఎంపికైన విద్యార్థుల కోసం యడ్లపాడు సమీపంలోని బోయపాలెంలో జిల్లా శిక్షణ కేంద్రం (డైట్) ఏర్పాటు చేశారు. వాస్తవంగా ఇక్కడ రెగ్యులర్ అధ్యాపకుల కంటే పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన అధ్యాపకులు ఎక్కువగా ఉన్నారు. విద్యార్థులు 100లోపు ఉన్నా ఉపాధ్యాయుల సంఖ్య మాత్రం భారీ స్థాయిలో ఉన్నట్లు తెలిసింది. జిల్లా శిక్షణ కేంద్రంలో దాదాపు 15 మందికి పైగా అధ్యాపకులు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఇందులో ముగ్గురు ప్రకాశం జిల్లా నుంచి వచ్చి ఇక్కడ డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. వాస్తవంగా నిబంధనల ప్రకారం డిప్యుటేషన్ కాల పరిమితి మూడేళ్లు. ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల్ని వారి మాతృస్థానాలకు పంపాలి. అయితే డిప్యుటేషన్ ముగిసినా ఇక్కడ పని చేస్తూనే ఉన్నారు. వారంతా సబ్జెక్టు టీచర్లు కావడంతో పాఠశాలల్లో ఇబ్బందులు నెలకొంటున్నాయి. అయితే ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఉన్నతాధికారులు ఏళ్ల తరబడి వారిని ఇక్కడే ఉంచుతున్నారు. ఫలితంగా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడుతుందని హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది నుంచి మూడేళ్లు..

జిల్లా శిక్షణ కేంద్రంలో పని చేయడానికి వచ్చే


బోయపాలెంలోని డైట్ కళాశాల

ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం నియమ, నిబంధనలు ఏర్పాటు చేసింది. అయితే అవి ఇక్కడ అమలు కావడం లేదు. పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై డైట్‌లో పని చేయడానికి వచ్చే ఉపాధ్యాయులు కనీసం సంవత్సరం లేదా గరిష్ఠంగా మూడేళ్ల పని చేయాల్సి ఉంది. అయితే ఈ నిబంధనను తుంగలో తొక్కి ఏళ్ల తరబడి ఉపాధ్యాయులు పాతుకుపోయారు. తాము బోధించాల్సిన అంశాలు తక్కువైనప్పటికీ కొన్నిసార్లు అసలు అధ్యాపకులు పని లేకపోయినా ఇక్కడే ఉంటూ నెలకు లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఇతర వ్యాపకాల్లో మునిగిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఫెషియల్ హాజరు వేసి రియల్ ఎస్టేట్, బిల్డింగ్ నిర్మాణం తదితర రంగాల్లో విధులు నిర్వహిస్తు రెండు చేతులా సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారిణి భర్త కోసం నిబంధనలు మార్పు

జిల్లా శిక్షణ కేంద్రంలో పనిచేసే ఓ అధ్యాపకుడిని ఏళ్ల తరబడి ఇక్కడే పని చేసేలా పాఠశాల విద్యా శాఖలో పని చేసే అధికారిణి తన వంతు సహకారం అందిస్తున్నారు. కారణం ఆయన ఆమె భర్త కావడమే. ఆయన ఐదేళ్లకుపైగా ఇక్కడే కొనసాగుతున్నారు. ఇక్కడ పనిచేసే కొంతమంది ఉపాధ్యాయులకు ఇటీవల డిప్యుటేషన్ రద్దయింది. దీంతో తాము పాఠశాలలకు వెళ్తామని సన్నద్ధమైయ్యారు. అయితే సదరు అధికారిణి ససేమిరా అంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తన భర్తను కూడా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాల్సి వస్తుందన్న ఆలోచనతో ఆమె డిప్యుటేషన్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఉపాధ్యాయుల ఆందోళన..

జిల్లా విద్యాశాఖలో కీలక విభాగంలో పనిచేసిన సదరు అధికారిణి ప్రస్తుతం పాఠశాల విద్యలో డైరెక్టర్ స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె ఇక్కడ పనిచేసిన సమయంలో తన కుమారుడికి ఇంట్లోనే ట్యూషన్ చెప్పేలా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంటి పనులకు కార్యాలయంలో సిబ్బందిని ఉపయోగించడం, ప్రైవేట్ స్కూల్స్ నుంచి భారీ మొత్తంలో నజరానాలు అందుకోవడం, దూరవిద్య పరీక్షల సందర్భంగా అక్రమాలు జరిగాయని కొంతమందిని ఇబ్బంది పెట్టి వారి వద్ద నుంచి భారీ మొత్తంలో దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ అధికారిణి తన భర్త కోసం డిప్యుటేషన్ నిబంధనలను కాలరాస్తున్నారు. డిప్యుటేషన్ ముగిసినా పాఠశాలలకు పంపించడం లేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులను మాతృ స్థానాలకు పంపించాలన్న డిమాండ్లు వస్తున్నాయి. త్వరలో పది పరీక్షలకు విద్యార్థుల్ని సన్నద్ధం చేయాల్సిన తరుణంలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖపై ఉంది.

డయేరియా కారణంగా ఎవరూ మృతి చెందలేదు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్


మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డయేరియా కారణంగా ఒక్క మరణం కూడా జరగలేదనీ, ప్రజలు డయేరియా అని భయపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ అంజనాపురం కాలనీలో గత రెండు రోజులుగా కాలనీవాసులు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. ఇద్దరు మృతి చెందారు. దీంతో శుక్రవారం మంత్రి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు ఫుడ్‌పాయిజన్ కారణంగా, బండారు చినవీరయ్య అనే 70 ఏళ్ల వృద్ధుడు క్రానికల్ వ్యాధితో బాధ పడుతూ మృతి చెందారని తెలియజేశారు. కాలనీలో మరో 15 మంది వ్యక్తులు వివిధ ఆసుపత్రులలో వైద్యసేవలు పొందుతున్నారని, డయేరియా లక్షణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించిందని, సీఎం చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ ప్రభుత్వ యంత్రాన్ని, మంత్రులను అప్రమత్తం చేశారన్నారు. అంజనాపురం కాలనీకి పెద్దఎత్తున వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లను నియమించినట్లు తెలిపారు. కానీ ప్రతిపక్షనేత సొంత పత్రిక అబద్ధాలు వండి వారుస్తుందని విమర్శించారు. గత వైసీపీ పాలనలో ఐదేళ్లలో 10 లక్షల 30 వేల 575 మంది అతిసార బారిన పడ్డారని వివరించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు.

మైక్రో శాండ్ వాటర్ ఫిల్టర్ మంజూరు

దాచేపల్లిలోని అంజనాపురం కాలనీలో రూ. 25 లక్షల వ్యయంతో మైక్రో శాండ్ వాటర్ ఫిల్టర్ నిర్మించనున్నట్లు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. దాచేపల్లిలోని అంజనాపురం కాలనీలో నివాసముంటున్న 800 మందికి ప్రత్యేకంగా మైక్రో శాండ్ వాటర్ ఫిల్టర్‌ను నిర్మిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ రవి, తహసీల్దార్ కుటుంబరావు, కమిషనర్ అప్పారావు తదితరులున్నారు.

మామూళ్ల దౌర్జన్యం!

(7 పేజీ తరువాయి)

అయినకాడికి మహిళలను దోచేస్తున్నారు.

- మంగళగిరి నగరంలోని ఒక డ్వాక్రా గ్రూపు రుణం తీరిపోవడంతో తాజాగా మరోమారు బ్యాంకు నుంచి రుణం తీసుకుంటున్నారు. రుణ చెల్లింపులు బాగుండడంతో రుణం ఇచ్చేందుకు బ్యాంకు కూడా ఓకే చెప్పింది. కానీ ఆర్పీ మాత్రం తనకు డబ్బులు ఇస్తేనే వ్యవహారం ముందుకు కదులుతుందని అడ్డం తిరిగింది. దీంతో వారు ఒక్కొకరూ రూ. 1,500 చెల్లించి పని పూర్తి చేయించుకున్నారు.
- తుళ్లూరు మండలంలోని ఒక గ్రామంలో ఇదే పరిస్థితి. డ్వాక్రా మహిళలు తాము పొదుపు కింద దాచుకున్న నగదు నుంచి రుణం తీసుకోవాలనుకున్నారు. భారీ మొత్తంలో కాకపోయినా వారికి ఒక్కొకరికి రూ. 20 వేలు రుణం వచ్చింది. అందరూ కలిసి రూ. 2వేలు ఇస్తేనే తాను పని చేసిపెడతానని యానిమేటర్ అడ్డం తిరిగింది. దీంతో వారంతా కలిసి ఆమెకు డబ్బులు ఇచ్చి పని చేయించుకోవాల్సి వచ్చింది. ఇది ఎక్కడో ఒక చోట జరుగుతున్న వ్యవహారం కాదు. జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్పీ, యానిమేటర్ల చేయి తడపకుండా ఒక్క పని కూడా జరగని పరిస్థితి.

లక్షలాది మందిపై ఒత్తిళ్లు

ఉమ్మడి జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 74,640 స్వయం సహాయక బృందాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. వాటిలో ఏడున్నర లక్షల మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉంటూ, స్వావలంబన కోసం కృషి చేస్తున్నారు. గ్రూపు నిర్వహణ, సభ్యుల సమావేశం, కార్యకలాపాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లను మెప్మా నియమించగా, గ్రామీణ ప్రాంతాల్లో యానిమేటర్లను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నియమించింది. ఇలా గ్రూపు మహిళలకు సహాయ, సహకారాలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు రాబందుల వ్యవస్థగా మారింది. డ్వాక్రా మహిళలను పీడించుకుతింటున్నారు. డ్వాక్రా మహిళలు తమకు నగదు చెల్లించడం అనేది తమ హక్కుగా భావించి వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్ల తెస్తున్నారు. ఒక్కో పనికి రేటు కట్టి మామూళ్ల వసూళ్ల చేస్తున్నారు.

రుణం పొందాలంటే రూ. 10 వేలు ఇవ్వాల్సిందే

డ్వాక్రా మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ఆర్థిక స్వావలంబన చేసుకునేందుకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణ సహాయం చేయిస్తుంది. ఏదో ఒక స్వయం ఉపాధి పొందుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఆ రుణాలు తోడ్పడుతాయి. అవి తీరిన వెంటనే మరోమారు ప్రభుత్వం రుణాలు అందిస్తుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను యానిమేటర్లు, ఆర్పీలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రతిసారి ఇలా రుణం పొందే సమయంలో ఒక్కో మహిళ నుంచి రూ. వెయ్యి నుంచి రూ.1500 వరకూ, లేదంటే గ్రూపు మొత్తంగా రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకూ ఆర్పీలు, యానిమేటర్లు వసూలు చేస్తున్నారు. రుణ దరఖాస్తులు పూర్తి చేయడానికి, తీర్మానాలు రాయడానికి ఈ మొత్తం వసూలు చేస్తున్నారు. మహిళలు ఇవ్వడానికి ఇష్టపడకపోతే మోకాలడ్డి ఆపుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా వెరవని స్థితికి చేరారు. ఫిర్యాదులు పెట్టకుండా బెదిరింపులకు దిగుతున్నారు. వీటితోపాటు అత్యవసర సమయంలో పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా వీరి మామూళ్ల బాదుడు తప్పడం లేదు. గ్రూపునకు రూ. 2వేల నుంచి రూ. 4వేలు ఇవ్వకుండా పని జరగడం లేదు. వీటితోపాటు ప్రతి నెలా నిర్వహించే గ్రూపు సమావేశంలో సమావేశంలోని అంశాలు, తీర్మానాలు రాసినందుకు రూ. 500 నుంచి రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు లబోదిబోమంటున్నారు.

మామూళ్లు తీసుకుంటే కఠిన చర్యలే



డ్వాక్రా మహిళల నుంచి మామూళ్లు వసూలు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. అయినప్పటికీ ఇలాంటి చర్యలు జరుగుతున్నట్లు మా దృష్టికి వస్తోంది. సెర్ప్, మెప్మా పరిధిలో ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా అక్కడికక్కడే చర్యలు తీసుకుంటాం. బాధితులు నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు.

- విజయలక్ష్మి, పీడీ డీఆర్‌డీఏ, మెప్మా(ఎఫ్ఏసీ)

నూతన రైల్వే లైన్ నిర్మాణం అమరావతికి వరం

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



గుంటూరు(తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి నూతన రైల్వే లైన్ నిర్మాణంతో రాజధాని ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం నవభారత్ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి నూతన రైల్వే లైన్‌కు కేంద్రం ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో నూతన రైల్వే లైన్ నిర్మాణంతో అమరావతి రాజధానికి మహర్దశ పడుతుందన్నారు. రూ.2,245 కోట్ల తో 57 కిలో మీటర్ల మేర నూతన రైల్వే లైన్ నిర్మాణం జరగనున్నట్లు తెలిపారు. కృష్ణానదిపై 3.2 కిలో మీటర్ల మేర పర్యాటకులను ఆకర్షించేలా ఐకానిక్ రైల్వే లైన్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించనున్న నూతన రైల్వే లైన్ రాజధానికి మణిహారంగా నిలవనుందన్నారు. నూతనంగా తొమ్మిది కొత్త రైల్వే స్టేషన్లు రావడంతో ఎర్రుపాలెం - నంబూరు మధ్య అన్ని ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఏర్పడడంతో పాటు వాహన రద్దీ తగ్గుతుందన్నారు.

దాతల తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి


కోటేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు అందజేస్తున్న ఆర్థిక తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సూచించారు. నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే చేతుల మీదగా శుక్రవారం ప్రవాస భారతీయుడు నూతక్కి రామకృష్ణ ప్రసాదు రూ.50 లక్షల విరాళాన్ని కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు అందజేశారు. అనంతరం కృష్ణప్రసాదు మాట్లాడుతూ దాదాపు రూ.25 కోట్ల విరాళాన్ని ప్రకటించిన రామకృష్ణ ప్రసాదును అభినందిస్తున్నట్టు తెలిపారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి గతంలో రూ.25 కోట్ల విరాళాన్ని నూతక్కి రామకృష్ణ ప్రసాదు ప్రకటించారని, ఇప్పటి వరకు రూ.9 కోట్ల 75 లక్షల సాయాన్ని అందజేశారని వివరించారు. నూతక్కి రామకృష్ణ ప్రసాదు మాట్లాడుతూ త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

28 నుంచి దూరవిద్య పరీక్షలు

పెదకాకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ కోర్సులకు 44 వేల మంది, పీజీ, డిప్లమా కోర్సులకు 15,300 మంది మొత్తం 59,300 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాలకు పరిశీలకులను, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను, రీజనల్ కోఆర్డినేటర్లను నియమించినట్లు రామచంద్రన్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

నేరస్తులపై.. నిఘా నేత్రాలు

(7 పేజీ తరువాయి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యాట్రిక్స్ సంస్థతో జరిగిన ఒప్పందంలో స్కాం జరిగిందని ప్రాజెక్టును ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టి మూలన పడేసింది. ఫలితంగా నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగలు, చైన్ స్నాచింగ్ నేరస్తులు చెలరేగిపోయారు. అసాంఘిక శక్తులు పెట్రేగాయి. సీసీ కెమేరాలు అందుబాటులో లేకపోవడంతో ఎంతటి పెద్ద నేరాలు జరిగినా నేరస్తులను పోలీసులు గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే మార్గాలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఈ క్రమంలో గతంలో మ్యాట్రిక్స్ సంస్థ ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించి పూర్తిస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లతో పాటు కొన్ని రహస్య ప్రాంతాల్లో ఫేస్ రికగ్నేషన్ కెమేరాలను ఏర్పాటు చేయనున్నారు. జన సమర్థంగా ఉండే కూడళ్లు, ఇతర ముఖ్య ప్రదేశాల్లో కూడా మ్యాట్రిక్స్ కెమేరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన పోలీసు అధికారులు ఎస్‌హెచ్‌వోల వారీగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కెమేరాల ఏర్పాటుతో నేరస్తుల కదలికలను పసిగట్టి నేరాలను కట్టడి చేయడంతో పాటు నేరం జరిగిన తర్వాత వారిని పట్టుకునే సౌలభ్యం కూడా ఉంటుందని పోలీసు శాఖ భావిస్తోంది. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్ల ఫొటోలను తీయించి డిజిటలైజేషన్ చేసి మ్యాట్రిక్స్ సంస్థకు అప్‌లోడ్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో పోలీసు శాఖ నిమగ్నమైంది. భవిష్యత్‌లో ఫేస్ రికగ్నేషన్ కెమేరాలను ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసుకుంటే వాటిని కూడా మ్యాట్రిక్స్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసే అవకాశం ఉంది. తద్వారా నేరస్తులు ఏ ప్రాంతానికి వెళ్లినా ఇట్టే పసిగట్టే అవకాశం ఉంటుంది.

గుర్తింపు.. వెంటనే అప్రమత్తం

రోడ్లు, ఇళ్లు, కార్యాలయాల వద్ద జన సంచారాన్ని రికార్డు చేసేందుకు సాధారణంగా సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తుంటాం. ఇలాంటి వాటినే గతంలో పోలీస్ శాఖ కూడా వినియోగించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మ్యాట్రిక్స్ సంస్థతో కుదుర్చుకున్న



ఒప్పందంలో భాగంగా మనిషి ముఖాన్ని(ఫేస్ రికగ్నేషన్) గుర్తించడమే కాకుండా అప్పటికే తమ వద్ద అప్లోడ్ అయిన వ్యక్తుల కదలికలను పసిగట్టి వెంటనే కంట్రోల్ రూమ్ ద్వారా అప్రమత్తం చేయడం మ్యాట్రిక్స్ సంస్థ ఏర్పాటు చేసే సీసీ కెమేరాల ప్రత్యేకత. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ సిగ్నల్స్ జంప్ చేసే వాహనాల నెంబర్లను గుర్తించడమే కాకుండా ఆ డేటా ప్రకారం సంబంధిత యజమానికి ఆన్‌లైన్లోనే చలానా పంపే పరిజ్ఞానం ఉంది. నైట్‌విజన్ కెమేరాలను, 360 డిగ్రీల రేడియస్ కలిగిన కెమేరాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఎస్పీలతో ఐజీ సమీక్ష

మూడు రోజుల క్రితం గుంటూరులో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తన కార్యాలయంలో రేంజి పరిధిలోని ఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో సీసీ కెమేరాలపై ప్రధానంగా చర్చించారు. దీంతో అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమేరాలు ఏర్పాటుతో పాటు రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా ఎస్పీలు అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు. స్టేషన్ల పరిధిలో రౌడీషీట్లు తెరిచిన సమయంలో తీసిన రౌడీషీటర్ల ఫొటోల ఆధారంగా డిజిటలైజేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వాటిని పీడీఎఫ్ ఫార్మాట్లో రౌడీషీటర్ సమగ్ర సమాచారంతో మ్యాట్రిక్స్ సంస్థకు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. తదుపరి దొంగలు, కేడీలు, సస్పెక్టెడ్ షీటర్స్ ఫొటోలను కూడా అదేవిధంగా అప్లోడ్ చేయాలని నిర్ణయించారు. అందరి ఫొటోలను మ్యాట్రిక్స్ సంస్థతో అనుసంధానం చేసిన తర్వాత ఆయా వ్యక్తులు రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా వారి కదలికలను ఫేస్ రికగ్నేషన్ కెమేరాలు పసిగట్టి కంట్రోల్ రూమ్‌లో ఉండే సిబ్బందిని అప్రమత్తం చేస్తాయి. దీంతో పోలీసులు వారి కదిలికలను పసిగట్టి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడానికి సాధ్యమవుతుంది.

అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ కేశవరెడ్డి

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ ప్రక్రియ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ పంచాయతీరాజ్ జాయింట్ డైరెక్టర్ ఆర్.కేశవరెడ్డి తెలిపారు. బాపట్ల విస్తరణా శిక్షణ కేంద్రంలో జిల్లా స్థాయి అధికారులు, రీసోర్స్ పర్సన్‌లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కేశవరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళిక సక్రమంగా తయారు చేయకపోవటం, ఆన్‌లైన్‌లో ఆడిట్ జరగకపోవటం వలన గతేడాది గ్రామ పంచాయతీలు, 27 మండల పంచాయతీలు, 4 జిల్లా పంచాయతీలు కేంద్ర ప్రభుత్వ నిధులు పొందుటకు అర్హత కోల్పోయినట్లు తెలిపారు. ప్రణాళిక ప్రక్రియ ఖర్చు నమోదులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర నిర్వహణలో పని చేస్తున్న క్లాప్ మిత్రలకు వేతనాల చెల్లింపులు చూపకపోవడంతో వేతనాలు చెల్లించే అవకాశం లేకుండా పోయిందన్నారు. జాయింట్ డైరెక్టర్ జె.రామనాథం, కోర్సుడైరెక్టర్ శ్రీనివాసరావు, రీసోర్స్‌పర్సన్‌లు ఎం.వి.సుబ్బారావు, కన్సల్టెంట్ డాక్టర్ మోహనరావు, డాక్టర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

'విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి'

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యను పూర్తిగా కాషాయీకరణకు మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ఆరోపించారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా 37వ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో కనీసం పాల్గొనలేని వారి చరిత్రలను పాఠ్యాంశాల్లోకి చేరుస్తున్నారని మండిపడ్డారు. జాతీయ నూతన విద్యా విధానం 2020 రద్దు చేయాలని కోరారు. నూతనంగా మెడికల్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వానికి వాటా వద్దని ఎన్ఎంసికి లేఖ రాయడం సరైన విధానం కాదన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలకు ఈ మహాసభ వేదిక అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, రాధాకృష్ణమూర్తి, కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పశు గణన పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు సిటీ, అక్టోబరు 25 : గుంటూరు జిల్లాలో ఈ నెల 28 నుండి చేపట్టనున్న పశు గణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇటువంటి కార్య క్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 28 నుండి 2025 ఫిబ్రవరి 25 వరకు ప్రతి పట్టణ, గ్రామాలలో పశుగణన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ కె శైలజ, పశు వైద్య సహాయకులు పి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల విధివిధానాలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల విధివిధానాలు, చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని లాలాపేట సీఐ శివప్రసాద్ సూచించారు. పోలీస్ స్మారక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో జరిగే ముఖ్యమైన విషయాలను, లాకప్, వైర్ లెస్ సెట్ , స్టేషన్‌లో నిర్వహించే విధుల గురించి విద్యార్థి, విద్యార్థులకు సీఐ వివరించారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా సైబర్ నేరాలపై స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీరయ్య చౌదరి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్కరూ ఆయా నేరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ ఇంట్లోని వారికి, చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు. స్థానిక కొరిటెపాడులోని శ్రీచైతన్య కాలేజీలో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.సైబర్ నేరాలపై అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నాకా బందీ.. 90 వాహనాలు సీజ్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ సబ్ డివిజన్ పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నాకా బందీ నిర్వహించారు. టీజేపీఎస్ కాలేజ్, జేకేసీ కాలేజీ రోడ్డు, రింగ్ రోడ్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దగ్గర పోలీసు అధికారులు, సిబ్బంది నాకా బందీ నిర్వహించారు. మహిళా స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేని, నంబర్ ప్లేట్ లేని వాహనాలను, త్రిబుల్ రైడింగ్ వాహనాలు, మైనర్లు నడిపే వాహనాలు మొత్తం 90 వాహనాలు సీజ్ చేశారు.

గుంటూరుకు 'చంద్రబాబు నాయుడుకు మాదిగల కృతజ్ఞత యాత్ర'

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాదిగలు అండగా నిలబడాలని ఏ పీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ఆయన తలపెట్టిన 'చంద్రబాబు నాయుడుకు మాదిగల కృతజ్ఞత యాత్ర' శుక్రవారం గుంటూరుకు చేరుకుంది. స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగల అభ్యున్నతి కోసం చంద్రబాబు అనేక కార్యక్రమాలను రూపొందిస్తున్నారని అన్నారు. త్వరలోనే ఎస్సీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వందేభారత్‌కు లేని అడ్డంకి ఇంటర్‌సిటీకి ఎందుకు?

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి-విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని శుక్రవారం విష్ణుపురం సమీపంలో నిలిపివేయడంతో ఆ రైలు రెండు గంటలకు పైగా ఆలస్యంగా గుంటూరు, మంగళగిరి, విజయవాడకు చేరాల్సి వచ్చింది. నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఈ రైలుని నిలిపివేశామని రైల్వే వర్గాలు చెబుతున్న సమాధానంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఐ వర్కులు కారణంగా ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ని శుక్రవారం మార్గమధ్యంలో రెగ్యులేషన్ చేస్తామని ముందుగా రైల్వే శాఖ ఎలాంటి ప్రకటన చేయలేదు. పైగా ఈ రైలు రోజులానే నిర్ధిత షెడ్యూల్ ప్రకారం లింగంపల్లిలో బయలుదేరి విష్ణుపురం వరకు దానికి కేటాయించిన టైంటేబుల్‌లోనే ప్రయాణించింది. కాగా, ఈ రైలు కన్నా ముప్పావు గంట ఆలస్యంగా సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి విష్ణుపురం వద్ద ప్రిసిడెన్స్ ఇచ్చి ముందుకు పంపించి వేశారు. ఎన్ఐ వర్కుల కోసం ట్రాఫిక్ బ్లాక్ తీసుకొన్నప్పుడు అన్ని రైళ్లను రెగ్యులేషన్ చేయాలి. అలా కాకుండా వందేభారత్‌కి క్లియరెన్స్ ఇచ్చేసి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని రెండు గంటల పాటు నిలిపేయడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

మందుబాబులు ఫుల్.. నిబంధనలు నిల్

● తగ్గిన ధరలు... అందుబాటులో బ్రాండ్లు ● దుకాణాల ముందు, రోడ్డుపైనే మద్యపానం
● గుడికీ బడికీ సమీపంలో దుకాణాలు ● మహిళలు, విద్యార్థులకు ఇబ్బంది

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మద్యం పాలసీతో నూతనంగా ఏర్పాటు చేసిన వచ్చిన మద్యం దుకాణాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది.వివిధ ప్రముఖ కంపెనీల బ్రాండ్స్ అందుబాటులో ఉండటంతో మందుబాబులు క్యూ కడుతున్నారు. కొత్త మద్యం దుకాణాలు ప్రారం భించిన తర్వాత వచ్చిన మొదటి శని,ఆదివారాల్లో మందు బాబులు పోటెత్తుతున్నారు. రూ.99 కే మద్యం బాటిల్ అందుబాటులో ఉండడంతో రోజువారి కూలీలు కార్మికులు ఒక్కొక్కరు రెండు,మూడు బాటిల్స్ చొప్పున కొనుగోలు చేసి తీసుకు వెళ్తున్నారు. ఆయా మద్యం దుకాణాల నిర్వాహకులు వారి దుకాణాల ముందే మంచినీరు, సిగిరెట్లు, ఆహార పదార్థాలను అందు బాటులో ఉంచుతున్నారు. దీంతో, దుకాణాల ముందు ఉన్న రోడ్లపైనే తాగేస్తున్నారు. మద్యం దుకాణాలకు అధిక సంఖ్యలో వస్తున్న మందు బాబులు రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. పక్కన ఉండే దుకాణాల ముందు కూడా వారి వాహనాలను ఉంచుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో పాటించాల్సిన నిబంధనలు సక్రమంగా అమలు కావట్లేదు. పాఠశాలలు, దేవాలయాలకు నిర్దీత దూరంలో మద్యం దుకాణలు ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలను అమలు చేయాల్సిన ఎక్సైజ్ అధి కారులు మాత్రం చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తు న్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని నాయుడుపేట మూల మీద కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద మందు బాబులు రోడ్లపైనే మద్యం తాగుతుండటం నత్యం కనిపించే దృశ్యం. ఆ మద్యం దుకాణం వద్ద ఉన్న గోడకు ఏకంగా టేబుల్ కూడా ఏర్పాటు చేసి, పక్కనే వారికి అవసరమైనవి అందుబాటులో ఉంచారు. దీంతో, చుట్టుపక్కల దుకాణాల వారితో పాటు రాకపోకలు సాగించే మహిళలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఆ దుకాణానికి సమీపంలో దర్గాతో పాటు ఓ కార్పొరేట్ స్కూల్ కూడా ఉంది. విద్యార్థినీ విద్యార్థులు ప్రతిరోజు ఆ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై స్థానికులు, విద్యార్థుల తల్లి దండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ పోలీస్ అధికారులు స్పందించి బడికీ గుడికీ సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయ కుండా చర్యలు తీసు కోవాలి. ప్రధాన రోడ్లపై ఏర్పాటు చేసే మద్యం దుకా ణాల వద్దే మద్యం తాగకుండా చర్యలు తీసు కోని పక్షంలో స్థానికులు, ముఖ్యంగా మహి ళలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొనే పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది.



అమరావతిరోడ్డులోని నాయుడుపేట వద్ద మద్యం దుకాణం ముందే మందుబాబులు, ఆదుకాణం బయట ఏర్పాటు చేసిన టేబుల్ వద్ద నిలబడి మద్యం తాగుతున్న దృశ్యం





సంజీవయ్య నగర్ వద్ద పరిశీలన చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అభివృద్ధి పనులు నిర్దేశిత షెడ్యూల్‌లో పూర్తి చేయాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి పనులు నిర్దేశిత షెడ్యూల్ మేరకు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీని వాసులు ఆదేశించారు. స్థానిక రత్నపురికాలని, మల్లికార్జునపేట, శారదాకాలనీ ఎక్స్ టెన్షన్, బొంగరాలబీడు గ్యాస్ దహనవాటిక, సంజీవయ్య నగర్, రత్నగిరినగర్ తది తర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణలు, గోరంట్లలో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసు కున్న భవనాలను ఆయన పరిశీలించారు. పాట్ హోల్స్ మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత మల్లికార్జునపేట, రత్నపురికాలనీ, శారదా కాలనీ ఎక్స్ టెన్షన్ లోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనుల వారీగా ఇంజి నీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, టెండర్ ద్వారా పొందిన పనులు వెంటనే ప్రారంభించాలని, పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ల వివరాలు ఇవ్వాలని అన్నారు. మలికార్జునపేటలో నివా సాల మధ్య గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ ఉండడం గమనించిన కమిషనర్, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బొంగరాలబీడు మహా ప్రస్థానంలో 14 ఫైనాన్స్ నిధులతో నిర్మాణం చేసిన గ్యాస్ దహనవాటికను పరిశీలించి, వినియోగంలోకి తీసుకురావ డానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. సంజీవయ్య నగర్ రైల్వే ట్రాక్ దగ్గర రోడ్ ఆక్రమ ణలను తొలగించడం, పెండింగ్ విస్తరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోరంట్లలో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన భవనాలను పరిశీలించి, నిర్మాణదారులు నిబంధనల మేరకు నిర్మాణాలు చేసుకోవాలని, నిబంధనలు పాటించని వాటికి తదుపరి అనుమతులు జారీ చేయమని కమిషనర్ చెప్పారు.

ఇంజనీరింగ్ అధికారులపై కమిషనర్ ఆగ్రహం

పెద్దపలకలూరు రోడ్డులోని రత్నగిరి నగర్ లో తాగునీటి సరఫరాపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించిన కమిషనర్ స్థానికులతో మాట్లాడారు. గత వారం రోజుల నుండి పైప్ లైన్ ద్వారా తాగునీటి సరఫరా జరగడం లేదని స్థానికులు చెప్పడంతో, తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారంరోజుల పాటు తాగునీరు లేకపోతే ఎందుకు మరమ్మతులు చేపట్టలేదని ఇంజనీరింగ్ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్ల సమస్య వలన ఆవిధంగా జరిగిందని చెప్పిన అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తాగునీటి ఫిర్యాదులపై ఇంజినీరింగ్ అధికారులు శ్రద్ధ పెట్టాలని, మోటార్లు శుక్రవారం సాయంత్రానికి మరమ్మతులు చేసి సరఫరా ఇవ్వాలని స్పష్టం చేశారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయా లని ఆదేశించారు.. ట్యాంకర్ల డ్రైవర్లు డబ్బులు అడుగుతున్నారని స్థానికులు తెలపగా అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీఈఈని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ మేయర్ వి.బాలవజ్రబాబు, ఈఈ కోటేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ రామారావు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసిపిలు, ఆర్.ఓ.లు, డిఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

నగరంలోని రోడ్లపై, డ్రెయిన్లపై ఆక్రమణలను దశలవారీగా తొలగించాలని, ఆక్రమణలు పునరావృతం కాకుండా సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, టీపీబీఓలు బాధ్యతగా తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ చాంబర్ లో శుక్రవారం పట్టణ ప్రణాళికా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో బహుళ అంతస్తుల నిర్మా ణాలకు ఇచ్చిన షార్ట్ ఫాల్స్ పై నవంబర్ 15లోపు నోటీసులు ఇవ్వాలని, స్పందించని వాటి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ అనంతరం నిబంధనలు ఉల్లంఘించి అనధికార నిర్మాణాలు చేస్తున్నారని, అటువంటి వాటిని పూర్తిగా తొలగించాలన్నారు. ఫంక్షన్ హాల్స్, మాల్స్, హోటల్స్ పార్కింగ్ సదుపాయం వారే కల్పించుకోవాలని చెప్పారు. నగరంలో అనధి కార బ్యానర్లు ఇష్టానుసారం ఏర్పాటు చేస్తుంటే దళం సభ్యులు ఏమి చేస్తున్నారని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మారకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. త్వరలో వెండింగ్ జోన్లు, పార్కింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

28న డయల్ యువర్ కమిషనర్

నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి గాను ఈ నెల 28వ తేదీన ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, సచివాలయ సేవలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 0863-2224202 నంబర్‌కి కాల్ చేసి నేరుగా కమిషనర్ దృష్టికి తమ సమస్యను తెలియజేయవచ్చని తెలిపారు.

ఘనంగా జాతీయ ఆక్యుపంక్చర్ డే వేడుకలు

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆక్యుపంచర్ డే వేడుకలను శుక్రవారం ఆస్పా భారత్ కార్యాలయంలో ఘనంగా నిర్వ హించారు. తొలుత ఉత్సవాల బ్రోచర్లను రిలీజ్ చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆస్పా భారత్ జాతీయ ఉపాధ్యక్షులు ముంజంపల్లి శివకుమార్ మాట్లాడుతూ ఆక్యుపంచర్ సైన్స్ ఒక జీవన విధానమని, ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని స్వయంగా అభ్యసించాలన్నారు. ఆక్యుపంచర్ విధానంలో శరీరంలో అంతర్గతంగా దాగి ఉన్న శక్తిని వెలికి తీయ డమే గాక అంతర్గతంగా ఉన్నటువంటి రుగ్మతలను తొలగించడంలో, శరీర శక్తిని పెంచడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆక్యు పం చర్ ప్రాక్టీస్ అసోసియేషన్ కన్వీనర్‌గా కాశి మహంతి సునీతను, తెలంగాణ కన్వీ నర్‌గా ఏపీఎస్ కుమారస్వామి, ఒడిశాకు శ్యామల, వెస్ట్ బెంగాల్‌కు తౌసిఫ్, ఆస్పా భారత్ జాతీయ అధ్యక్షుడిగా ఏ.రవి, ఉపాధ్యక్షుడిగా ముంజంపల్లి శివకుమార్‌లను ఎన్నుకున్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లతో మహిళల సంతోషం: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కానుకగా రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్లను ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇవ్వనుండటంతో మహిళల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో మాధవి అధ్వర్యంలో తెలుగు మహిళలు ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్లెక్సీకి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే క్రమంలో ఉచితి సిలిండర్ల పథకంతో మరో ముందడుగు వేశారని అన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందుతుందన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయాలని చూస్తున్న జగన్, గతం మరిచినట్టు ఉన్నారని విమర్శించారు. కార్పొరేటర్ శ్రీవల్లి, దాసరి జ్యోతి, డాక్టర్ కల్పన, నేపాక పద్మ, లాం నవమి, విజయలక్ష్మి, వకులాదేవి, మీనాక్షి, కరిమూన్, శోబారాణి పాల్గొన్నారు.

● సమాజానికి మేలు చేసే వ్యక్తులను ఎన్నుకోవాలి

మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి పట్టభద్రులు అండగా ఉండాలని, సమాజానికి మేలు చేసే వ్యక్తులను ఎన్నుకోవాలని ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు. స్థానిక టీజేపీఎస్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం పట్టభద్రుల ఓటు నమోదు అవగాహన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా -గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పుతో గొప్ప విజన్ ఉన్న నాయకున్ని ఎన్నుకున్నారని ,ఇప్పుడు కూడా అదే విజ్ఞతతో ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోవెలమూడి రవీంద్ర, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, కసుకుర్తి హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపాల్ అనిత, కటకం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● గ్యార్మీ షరీఫ్ వేడుకలు

స్థానిక 33వ డివిజన్‌లోని జెండా చెట్టు, గాజుల వారి వీధి, సంపత్ నగర్‌లోని మాబు సుభాని దర్గా వద్ద శుక్రవారం గ్యార్మీ షరీఫ్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

'ఉచిత గ్యాస్' మహిళలకు వరం: ఎమ్మెల్యే నసీర్



స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకుంటున్న మహిళలు, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కానుకగా ప్రభుత్వం అమలు చేయనునన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం మహిళలకు వరమని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మహిళలుశుక్రవారం 'థాంక్యూ సీఎం సర్!' అంటూ టపాసులు పేల్చి, మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. నసీర్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నందుకు మహిళలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ నెల 29 నుంచి గ్యాస్ బుకింగ్ ప్రారంభం కానున్నాయని, ఈనెల 31న మన ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు పోతురాజు సమత, సజీల, ముప్పవరపు భారతి, వేముల జ్యోతి, గుడిపల్లి వాణి, వజ్జా లక్ష్మి, ముప్వ శైలజ తదితరులు పాల్గొన్నారు.


● మానవ మనుగడకు పశుసంపద దోహదం

నేటి సమాజానికి కూడా పశు సంపద ఎంతో అవసరమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. 21వ పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. నవంబర్ 1 నుంచి ఫిబ్రవరి 28 వరకూ ఈ గణన సాగుతుందని, అందరూ సహకరించాలని కోరారు. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి పశుగణన పోస్టర్లను, ఎన్యుమరేటర్లకు ఇచ్చే ట్రావెలింగ్ కిట్ బ్యాగులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

27న అఖిల భారత యాదవ మహాసభ

గుంటూరు సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 న గుంటూరులో అఖిల భారత యాదవ మహాసభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి యాదవ్ తెలిపారు. విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ .స్థానిక అరండల్ పేట 2/4 లోని వైన్స్ డీలర్ కళ్యాణ మండపంలో ఈ మహాసభ జరగనుందని అన్నారు. యాదవులను ఐక్యత పరిచి అభివృద్ధి పథంలో నడపడమే మహాసభ లక్ష్యమని చెప్పారు.

కాసు శాయమ్మ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థులు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం వేణుగోపాల రావు, పీడీ జి .సునీలామాధవి

గుంటూరు(విద్య),అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లాన్ టెన్నిస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని స్థానిక కొత్తపేటలోని కాసు శాయమ్మ మున్సిపల్ స్కూల్ హెచ్ ఎం ఎన్ వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగంలో గోలి జోషిత, అండర్-14 విభాగంలో గోలి ఆలోక్ జిల్లా స్థాయిలో నిర్వహించిన లాన్ టెన్నిస్‌లో విజయం సాధించి, ఈ నెల 28న కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

శ్రీశైలం దేవస్థానం ఇన్‌చార్జ్ ఈవో నియామకం నిబంధనలకు విరుద్ధం: దర్శనపు శ్రీనివాస్

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం దేవస్థానానికి ఇన్‌చార్జ్ ఈవోగా చంద్రశేఖర్‌రెడ్డి నియామకం నిబంధనలకు విరుద్ధమని హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దర్శనపు శ్రీనివాస్ అన్నారు. స్థానికంగా శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దేవాలయంలో గత వైసీపీ ప్రభుత్వం చేయని తప్పులేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగమ శాస్త్రాలకు విరుద్ధంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వారం రోజుల క్రితం ఒక ఏసీ స్థాయి (అసిస్టెంట్ కమిషనర్) అధికారిని ఇన్‌చార్జి ఈవోగా నియమించడం నిబంధనలకు పూర్తి విరుద్ధమని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీకి ఏజంట్‌గా ఆయన పని చేశారని, ఇలాంటి అవినీతి అధికారిని తక్షణం శ్రీశైలం దేవస్థానం నుండి తొలగించకపోతే ఎండోమెంట్ కమిషనర్‌పై ముఖ్యమంత్రికి చంద్రబాబునాయుడుకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యం

● డీఆర్డీఏ, మెప్మా పీడీ విజయలక్ష్మి



గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల సభ్యులైన మహిళలను లక్షాధికారులను చేయడం కోసం కృషి చేస్తున్నామని జిల్లా గ్రామీణాభి వృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మా ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల స్వావలంబనే లక్ష్యంగా పనిచేస్తోం దని, వారిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు (ఎంటర్‌ప్రెన్యూర్లు)ను వెలికి తీసి దిశా నిర్దేశం చేయాల్సిన బాధ్యత తమపై పెట్టిందని, దానిలో భాగంగా ఇప్ప టికే ఒక అడుగు ముందుకు పడిందని తెలిపారు.

మహిళల అభ్యున్నతి కోసం ఏం చేస్తున్నారు?

పీడీ: మహిళల అభ్యున్నతి, స్వావలంభనే లక్ష్యంగా పనిచేస్తోంది. డ్వాక్రా గ్రూపు సభ్యులను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందించి మాకు అందిస్తోంది.

'స్వావలంబన' ఏంటి? మహిళలను ఎలా భాగస్వాములను చేస్తారు?



పీడీ: డ్వాక్రా సంఘాలు ఇప్పటి వరకూ రుణాలు తీసుకోవడం, సకాలంలో చెల్లించడం వరకే పరిమిత మవుతున్న సందర్భాలే ఎక్కువ. అలా కాకుండా వారిని ఏదో ఒక ఉత్పత్తి, విక్రయ కార్యక్రమంలోకి వచ్చేలా చేయాలన్నది 'స్వావలంబన'ఉద్దేశం.

వారిని ఎలా గుర్తిస్తారు? ప్రోత్సాహకాలు ఎలా వుండబోతున్నాయి?

పీడీ: గ్రూపులుగాగానీ, గ్రూపుల్లో ఔత్సాహిక మహిళలను గుర్తించిగానీ వారి ఆసక్తులకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందిస్తాం. వారిలో నుంచే ఎంటర్‌ప్రెన్యూర్లను ఎంపిక చేస్తాం. వారికి తాము శిక్షణ ఇప్పించడంతోపాటు, ఇప్పటికే శిక్షణ పొందిన ఇతర గ్రూపుసభ్యులతో శిక్షణ ఇప్పిస్తాం.

ఎంత మందికి శిక్షణ ఇచ్చారు? ఎలాంటి కార్యకలాపాలు సాగిస్తున్నారు?

పీడీ: ఇప్పటికి జిల్లాలో 250 గ్రూపుల్లో ఈ కార్యక్రమం అమలు చేశాం. వారికి ఆసక్తి వున్న రంగాల్లో కార్యకలాపాలు చేపట్టాం. ఉదాహరణకు మంగళగిరి చేనేత వస్త్రాల ఉత్పత్తి, విక్రయం, దుగ్గిరాల పసుపు విక్రయాలు, గుంటూరులో మిర్చి విక్రయాలు, కళంకారి వస్త్ర తయారీ, విక్రయం, తుళ్లూరులో బొబ్బట్ల తయారీ, విక్రయం వంటి కార్యకలాపాలు చేస్తున్నాం. ఇవే కాక మహిళలు కోరుకుంటే అనేక ఇతర రంగాల్లో కూడా శిక్షణ ఇప్పిస్తాం.

ఉత్పత్తులు, కార్యకలాపాలకు ప్రోత్సాహకం ఎలా ఇస్తున్నారు..

పీడీ:ఎంటర్‌ప్రెన్యూర్లను ప్రోత్సహించడం కోసం 'విమెన్ లెండింగ్' పేరుతో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రుణాలు ఇస్తున్నాం. రూ.10 లక్షల రుణం తీసుకుని తిరిగి చెల్లించే గ్రూపులకు మాత్రమే ఈ అవకాశం వుంటుంది.

మహిళలకు మార్కెట్ ఎలా? ఆ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందా?

పీడీ: మహిళలు తయారు చేసిన వస్తువులను స్థానికంగా విక్రయించుకోవడంతోపాటు, మార్టులు, ఆన్‌లైన్‌లో కూడా విక్రయించే సదుపాయం వుంది. ఇప్పటికే తుళ్లూరు బొబ్బట్లు విజయవాడలో ఫేమస్ అయ్యాయి. వాటికి డిమాండ్ బాగా పెరిగింది. ఆన్‌లైన్‌లో విక్రయాల కోసం డీఆర్డీఏ తరఫున ఫ్లిప్‌కార్టు, అమెజాన్, మీషోలాగా ఓఎన్‌డీసీ వెబ్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశాం. దాని ద్వారా క్రయ విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నాం. మహిళలు వారిఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అమ్ముకునేందుకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రం డీఆర్డీఏ సాఫ్ట్‌వేర్ టెక్నీషియన్ అందిస్తున్నారు.



పోటీల్లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న కల్నల్ దీపక్‌కుమార్‌శర్మ తదితరులు

దేశ సమగ్రతను కాపాడే పౌరులుగా రాణించాలి

● భాష్యం బ్లూమ్స్ స్పోర్ట్స్‌మీట్‌లో కల్నల్ దీపక్‌కుమార్

గుంటూరు(విద్య),అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే దేశ సమగ్రతను కాపాడే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఈ దిశగా విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని కల్నల్ దీపక్‌కుమార్ శర్మ అన్నారు. స్థానిక చంద్రమౌళినగర్‌లోని భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో శుక్రవారం నిర్వహించిన క్రీడోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. డాక్టర్ లక్ష్మానాయక్ ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ వారికి ఇష్టమైన క్రీడలో రాణించాలని కోరారు. సెల్‌ఫోన్,జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలను నేర్పించాలని చెప్పారు. పోటీల్లో గెలుపొందినవిద్యార్థులకు కల్నల్ దీపక్‌కుమార్ శర్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ కవిత, గిరిజారాణి,జెడ్ఈవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ క్విజ్ పోటీలు.. రెండో రౌండ్‌కు కేజేఎస్ఎస్ విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భారతీయ రిజర్వ్ బ్యాంకు స్థాపించి 90 సంవత్సరాలు అయిన సంద ర్భంగా జాతీయ స్థాయిలో ఆన్ లైన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలలో స్థానిక కమ్మ బాలికల వసతి గృహ విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఈ నెల 19, 20 తేదీలలో జరిగిన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. ఆర్‌వీఆర్‌అండ్‌జేసీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న బండ్లమూడి శైలజ, బండ్లమూడి యశస్విని, గోనుగుంట్ల ఆదిలక్ష్మి, కాపూరి ఆశ్రిత, విజ్ఞాన్ కాలేజీకి చెందిన జెట్టి ఉషా కల్యాణి , మన్నం అశ్వీత మొత్తం ఆరుగురు విద్యార్థినులు రెండో రౌండ్ చేరుకున్నారు. ఈ నెల 28న విజయవాడలో జరగనున్న రాత పరీక్షకు ఈ విద్యార్థినులు అర్హత సాధించారని కమ్మ జన సేవా సమితి ఉపాధ్యక్షుడు మల్లెల హరేంద్రనాద్ చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పాలకవర్గ సభ్యులు అభినందించారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు మాట్లాడుతూ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి నిర్వాహకులు వరుసగా రూ. 2 లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.1 లక్ష నగదు బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు.

బుల్లెట్‌కు తగ్గని క్రేజ్

విభిన్న రంగులు
అధునాతన మోడళ్లు
జిల్లాలో 70 వేలకు పైనే వినియోగం



వాహనాలెన్నొచ్చినా బుల్లెట్ పైనే యువత మోజు



గుంటూరు, సెప్టెంబరు 25: బుల్లెట్ వాహనం అంటేనే అదో క్రేజ్. మార్కెట్లోకి ఎన్ని ద్విచక్ర వాహనాలు వచ్చినా బుల్లెట్‌కు ఉండే హుందాతనమే వేరు. అందుకే యువత నుంచి నడి వయసు వారు సైతం బుల్లెట్‌పైనే ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల వీటి జోరు మరింత ఎక్కువవుతోంది. కళాశాలల్లో చదివే యువత నుంచి ఉద్యోగులు సైతం కొనుగోలు చేస్తూ డుగ్ డుగ్ సౌండ్స్‌తో దూసుకెళుతున్నారు. బుల్లెట్‌ల దిగ్గజ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ యువత నచ్చేలా విభిన్న రంగులు, మోడల్స్‌లో వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో 70వేలకు పైనే వీటి వినియోగం ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బుల్లెట్‌లలో రూ. 2.12 లక్షల నుంచి రూ. 4.70ల వరకు ధరల్లో లభిస్తున్నాయి.

కొండలు, గుట్టలు ఎక్కడికైనా 'హిమాలయన్'

పెద్దవైన రాళ్ళు, కొండలు, గుట్టలపైనైనా తేలికగా డ్రైవ్ చేసుకొని ప్రయాణించేలా రాయల్ ఎన్‌ఫీల్డ్ వారు హిమాలయ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. 450 సీసీ ఇంజన్‌తో ఇది కొండలపైనైనా తేలికగా ప్రయాణించేలా రూపొందించారు.

లైట్ వెయిట్‌లో హంటర్

బుల్లెట్‌లో కూడా హంటర్ లైట్ వెయిట్ వంటి బరువు తక్కువగా ఉండే వాహనం కూడా అందుబాటులోకి వచ్చింది. ఇది కళాశాల స్థాయి యువతకు బరువు తక్కువగా ఉంటుంది. మరో వైపు క్లాసిక్ మోడల్‌లో సింగిల్ డిస్క్, డబుల్ డిస్క్ బ్రేక్‌ల కలిగిన బుల్లెట్ అందుబాటులో ఉంది. ఇవి కూడా 350 సీసీ ఇంజన్‌తో మద్రాస్‌రెడ్, జోధ్‌పూర్ బ్లూ, మిటాలియన్ కలర్‌తో పాటు ఏడు రంగుల్లో లభ్యమవుతున్నాయి.

నాలుగు రకాల్లో బుల్లెట్..

బుల్లెట్ ప్రారంభ మోడల్స్‌లో నాలుగు రకాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో 350 సీసీ ఇంజన్‌తో మిలటరీ, బ్లాక్, రెడ్ రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. అంతేగాక మిలటరీ కలర్‌తో పాటు సిల్వర్ , బ్లాక్, రెడ్‌లో కూడా ఉన్నాయి. స్టాండర్డ్ టైప్ బుల్లెట్‌లో బ్లాక్ , మెరూన్, బ్లాక్ , గోల్డ్ రంగులు లభిస్తున్నాయి. ఇవన్నీ రూ. 2.12 లక్షల నుంచి రూ. 2.39 లక్షల వరకు ధర చెబుతున్నారు.

మెయింటెనెన్స్ తక్కువే..
- బుల్లెట్ మెకానిక్ బాబు



ఇతర బైక్‌లతో పోల్చుకుంటే బుల్లెట్ మెయింటెనెన్స్ చాలా తక్కువగా ఉంటుంది. నేను 30 ఏళ్ళుగా బుల్లెట్ మెకానిక్‌గా పనిచేస్తున్నా. వాహనం నడిపే వారికి ఎంతో స్మూత్‌గా ఉంటుంది. మరో వైపు వాహన ప్రమాదాలు కూడా పెద్దగా జరగవు. యువతే కాదు నడి వయస్సు, పెద్ద వారు కూడా బుల్లెట్ నడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొత్తగా వచ్చే వాహనాలు మైలేజ్ కూడా బాగానే ఇస్తున్నాయి. దాంతో ఎంతో మంది బుల్లెట్‌నే కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పైగా బుల్లెట్ నుంచి సౌండ్ అన్ని వాహనాల కన్నా ఓ రేంజ్‌లో ఉంటుంది. అందుకే అందరూ ఇష్టపడుతుంటారు.

40 ఏళ్ళుగా బుల్లెట్ నడుపుతున్నా...
- ధూళిపాళ్ళ వెంకటేశ్వరరావు



నేను 40 ఏళ్ళుగా బుల్లెట్ నడుపుతున్నా. రాయల్టీకి కేరాఫ్‌గా బుల్లెట్ ఉంటుంది. రూ. లక్షలు పోసి కారు కొన్నా బుల్లెట్ పై తిరిగిన అనుభూతి, రాయల్టీ మరో వాహనానికి రాదు. బుల్లెట్ నుంచి వచ్చే బీట్ సౌండ్ మరే వాహనానికి రాదు. హుందా తనం ఉట్టిపడేలా ఉంటుంది. ప్రమాదాలు కూడా పెద్దగా జరగవు. ఒక వేళ వాహనం కింద పడినా చిన్నా చితకా గాయాలు తప్ప ప్రాణహాని జరగదు.

డబుల్ సైలెన్సర్‌లతో ఇంటర్ సెప్టార్

ఎంతో స్టైలిష్‌గా ఉండే ఇంటర్ సెప్టార్‌కు డబుల్ సైలెన్సర్ ప్రత్యేకత. రెండు సైలెన్సర్‌లతో డుగ్ డుగ్ అంటూ రహదారిపై మోత పుట్టిస్తుంది. 650 సీసీ ఇంజన్ పవర్‌తో దూసుకెళుతుంది. ఇదే కోవలో కాంటి నెంటల్ జీటీ యూత్‌ను మరింత ఆకట్టు కుంటుంది. మొత్తం ఆరు రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. సూపర్ మిటియో పేరుతో మరో బుల్లెట్ క్రూజ్ మోడల్లో అందుబాటులోకి వచ్చింది.

ఇరుకు రోడ్లలోనైనా రైడ్ చేసే షార్ట్ గన్

ఇరుకు రోడ్లలోనైనా, సందులు, గొందుల్లోనైనా సరే సులభంగా డ్రైవ్ చేసేలా 'షార్ట్ గన్' మోడల్‌ను అందుబాటులోకి తెచ్చారు. 650 సీసీ పవర్ ఇంజన్‌తో ఇది నాలుగు రంగుల్లో లభ్యమవుతుంది. ఇక ఇది ప్రారంభ ధర రూ. 4.35 లక్షల నుంచి రూ. 4.51 లక్షల వరకు ధరగా నిర్ణయించారు.





విభిన్న రంగుల్లో గరిల్లా బుల్లెట్

- **లాంగ్ డ్రైవ్‌కు మిటియో క్రూజర్**
  ఎవరైనా దూర ప్రాంతాలకు తేలిక అతి కొద్ది సమయంలోనే దూసుకెళ్ళాలనుకునే వారికి బుల్లెట్‌లో మిటియో క్రూజర్ బుల్లెట్ అందుబాటులో ఉంది. ఇది ఎంత దూరం డ్రైవ్ చేసినా ఎటువంటి బ్యాక్ పెయిన్ రాదని నిర్వాహకులు చెబుతున్నారు.
- **గ్రామస్థాయిలో రోడ్లపై డ్రైవ్‌కు స్క్రామ్**
  చిన్న పాటి సందు గొందులతో పాటు గ్రామ స్థాయిలో రోడ్లలో నడిపేందుకు వీలుగా 'స్క్రామ్'బుల్లెట్ అందుబాటులో ఉంది. దీంతో ఎటువంటి రహదారుల్లోనైనా ప్రయాణించినా అలసట లేకుండా సౌకర్యంగా ఉంటుంది.
- **మంచి స్టైలిష్‌గా గరిల్లా**
  వాహనం చూస్తానికి చిన్నదే అయినా యూత్ నచ్చే స్టైలిష్‌గా ఉండే దే గరిల్లా మోడల్. 450 సీసీ ఇంజన్ పవర్‌తో యువత ఇట్టే దూసుకుపోయేలా అందుబాటులోకి తెచ్చారు. దీనిపై ఇటీవల యువత కొనుగోలు చేసుందుకు మోజు చూపుతున్నారు.



కేంద్ర మంత్రి షెకవత్ నుంచి బహుమతిని అందుకుంటున్న ఎస్ఆర్ఎం విద్యార్థులు

జాతీయ స్థాయి షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో
ఎస్ఆర్ఎంకు ద్వితీయ బహుమతి

మంగళగిరి సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ జాతీయస్థాయిలో నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల్లో ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ఎస్ఆర్ఎంకు చెందిన సినీమేట్స్ క్లబ్‌లో సభ్యులైన ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్వాసుల షణ్ముఖ శివ దుర్గేశ్, షేక్ తహీర్, ఆవుల శివ ప్రకృతి విపత్తులు, భవిష్యత్ తరాలకు కల్పించాల్సిన రక్షణ అనే అంశంపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ను జాతీయ స్థాయి పోటీలకు పంపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అందిన మొత్తం 74ఎంట్రీలను పరిశీలించిన న్యాయ నిపుణులు ఎస్ఆర్ ఎం విద్యార్థులు నిర్మించిన 'ఆఫ్టర్ షాక్' అనే షార్ట్ ఫిల్మ్‌కు ద్వితీయ బహుమతిని ప్రకటించారు. న్యూఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటరులో ఈ నెల 23న జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాలు, రూ.లక్షా 50 వేల నగదు బహుమతిని అందుకున్నారు.

మిర్చియార్డులో మళ్లీ ఐఏఎస్ పాలన

- కొత్త పాలకవర్గం నియామకంలో ప్రభుత్వ జాప్యం
- అప్పటి వరకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ భార్గవతేజ
- రాజమండ్రి ఏఎంసీ కార్యదర్శి ఆంజనేయులుకు పూర్తి అదనపు బాధ్యతలు
- ఐవీ రెడ్డిని మార్కెటింగ్ శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశం



ఆంజనేయులు

గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో తిరిగి ఐఏఎస్ అధికారి పాలనకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కమిటీ కూర్పులో జాప్యం జరుగుతుండటంతో మార్కెటింగ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఈ నిర్ణయాన్ని తీసుకొన్నారు. మార్కెటింగ్ డైరెక్టర్ అంద జేసిన నివేదిక ఆధారంగా జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవ తేజని గుంటూరు ఏఎంసీ పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ శుక్ర వారం స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యంలో శనివారం జేసీ భార్గవతేజ మిర్చియార్డులో బాధ్యతలు చేపడతారని అధికారవర్గాలు తెలిపాయి.

వైసీపీ ప్రభుత్వ హయాంలోజరిగిన అవినీతి, అక్రమాలపై మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఫిర్యాదు మేరకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. మరోవైపు మార్కెటింగ్ శాఖ స్వీయ విచారణని కూడా ప్రారంభించింది. మార్కెటింగ్ జేడీ విజయవాడ రీజియన్ కాకుమాను శ్రీనివాసరావు నేతృత్వంలో 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నది. ఈ నేపథ్యంలో తాను యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా ఉండటం సరికాదని, తన బాధ్యతలు తీసేయాలని జేడీ శ్రీనివాసరావు కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ విషయాన్ని కమిషనర్ మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి నివేదించారు. దాంతో ఆయన జాయింట్ కలెక్టర్ భార్గవ తేజని పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంచుమించు దశాబ్దం తర్వాత..

మిర్చియార్డులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐఏఎస్ పరి పాలన కొన్ని నెలల పాటు సాగింది. జాయింట్ కలెక్టర్‌గా చెరుకూరి శ్రీధర్ ఉన్న సమయంలో మూడు, నాలుగు నెలల పాటు ఆయన పర్సన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. ఆ తర్వాత పాలకవర్గాలు ఏర్పాటు అయ్యాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా పాలకవర్గాలను నియమించడం వలన పర్సన్ ఇన్‌చార్జి అవసరం రాలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత కమిటీలను రాజీనామా చేయించింది. ఇంచుమించు నాలుగు నెల లుగా జేడీని పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించి పరిపాలనకు ఇబ్బంది లేకుండా చూస్తున్నది. ఇప్పుడు జేసీని నియమించడంతో యార్డులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపట్టింది.

మరోవైపు మిర్చియార్డు ప్రస్తుత ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డిని మార్కెటింగ్ స్పెషల్ సీఎస్ తొలగించారు. ఆయన్ని హెడ్ ఆఫీసులో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. వెంకటేశ్వర రెడ్డి స్థానంలో రాజమండ్రి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వీ ఆంజనేయులుని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంజనేయులు గతంలో గుంటూరు ఏఎంసీలో కొంతకాలం విధులు నిర్వహించిన అనుభవం ఉన్నది. కాగా ఆయను ఏడాదిలోపు పదవీ విరమణ కానున్నారు.



ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావుతో సమావేశమైన ఎన్ఐఆర్ఎఫ్ ఎక్స్‌ఫర్ట్ కమిటీ సభ్యులు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో
ఎన్ఐఆర్ఎఫ్ ఎక్స్‌ఫర్ట్ కమిటీ పర్యటన

- ప్రిన్సిపాల్స్ , అకడమిక్ డీన్లు, అధికారులతో కమిటీ సభ్యుల బృందం సమావేశం

పెదకాకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎన్ఐఆర్ఎఫ్ ఎక్స్‌ఫర్ట్ కమిటీ పర్యటన శుక్రవారం ప్రారంభమైంది. ఈకమిటీలో న్యూఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ జుబేదా అన్సారి, హైదరాబాదులోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పూర్వ సీనియర్ నాక్ అడ్వైజర్ డాక్టర్ రమా కొండపల్లి, కోయంబత్తూర్‌లోని అమృత విశ్వ విద్యాపీఠం ఐక్యూ ఏసీ విభాగాధిపతి డాక్టర్. ప్రశాంత్ ఆర్. నాయర్‌ల బృందం వర్సిటీలో పర్యటించారు. ముందుగా కమిటీ సభ్యులకు ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య కే. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంలు సాదర స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సమావేశ మందిరంలో యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ , అకడమిక్ డీన్లు, అధికారులతో కమిటీ సభ్యుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో వర్సిటీ ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణసత్య , ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపికృష్ణ, వర్సిటీ ర్యాంకింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రవి తదితరులు యూనివర్సిటీ నివేదికను కమిటీ సభ్యులకు వివరించారు. అందులో అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్, ఇన్నోవేషన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సెల్, సోలార్ సిస్టం, బ్యాటరీ వెహికల్,సేంద్రియ వ్యవసాయం, బొటానికల్ గార్డెన్, కమ్యూనిటీ రేడియో, యూనివర్సిటీ ముద్రిస్తున్న జర్నల్స్, ఇప్పటివరకు యూనివర్సిటీ సాధించిన అంతర్జాతీయ, జాతీయ, ర్యాంకులు, గేట్ , ఐఏఎస్, యూజీసీ నెట్ కోర్సులకు ఉచితంగా అందిస్తున్న శిక్షణ వివరాలను వెల్లడించారు. గడచిన కొద్ది నెలల క్రితం వర్సిటీలో నాక్ బృందం పర్యటించి వర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్ ను అందించింది. అలాగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌లో యూనివర్సిటీకి ఓవరాల్ ర్యాంకింగ్‌లో 97వ స్థానం, యూనివర్సిటీల కేటగిరిలో 59వ స్థానం, స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ కేటగిరీలో 20వ స్థానం వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కే. గంగాధరరావు మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయం మరింత పురోగతి సాధించేందుకు ఎన్ఐఆర్ఎఫ్ 20వ ర్యాంకు నుంచి పదవ ర్యాంకు పొందేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి కమిటీ సభ్యులు సూచనలు చేయాలని కోరారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో పేటెంట్ హక్కులు పొందేందుకు అధ్యాపకులు చేస్తున్న కృషి, జాతీయ సంస్థలు అందిస్తున్న వివిధ ప్రాజెక్టులను అధ్యాపకులు అందిపుచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, డీన్లు ఆచార్య త్రిమూర్తి రావు, పాల్ కుమార్, రవికుమార్, ప్రిన్సిపాల్స్ ఆచార్య స్వరూప రాణి, ఆచార్య వీరయ్య, ఆచార్య ప్రమీల రాణి ,ఆచార్య సిద్దయ్య, ఆచార్య నిరూపమా, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి వెంకటేశ్వర్లు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్, ఐక్యూఏ సి మాజీ డైరెక్టర్ ఆచార్య సంధ్యకోలే తదితరులు పాల్గొన్నారు.

73.72 లక్షల విలువైన విదేశీ సిగరెట్లు ధ్వంసం

గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్మగ్లింగ్ కేసుల్లో పట్టుబడిన రూ 73.71 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లను ధ్వంసం చేసినట్లు ఏపీ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా, యడ్లపాడు మండలంలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ లో సిగరెట్లను కాల్చి బూడిద చేసే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ కస్టమ్స్ అధికారులు పట్టుకున్న విదేశీ సిగరెట్లను స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ వారి సహకారంతో సిగరెట్‌లను ధ్వంసం చే శామని, అన్ని అనుమతులతో, పర్యావరణానికి హాని కలగకుండా కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. ధ్వంసం చేసిన వాటిలో పారిస్, దరమ్ బ్లాక్ వంటి వివిధ చౌకబారు బ్రాండ్ సిగరెట్లు ఉన్నాయన్నారు. కస్టమ్స్ చట్టం లోని నిబంధనలకు విరుద్ధంగా ఈ సిగరెట్లు భారత్ దేశంలోకి అక్రమంగా దిగుమతి చేసినట్లు గుర్తించామన్నారు. ఈ స్మగుల్డ్ సిగరెట్లు మార్కెట్ లో విక్రయించడం చట్టరీత్యా నేరమని కమిషనర్ వెల్లడించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే నాసిరకంతో కూడుకున్న ఇటువంటి సిగరెట్లు అక్రమ రవాణాపై చర్యలు చేపడతామన్నారు. ఇలాంటి పన్ను చెల్లించని ఎన్నో బ్రాండ్ల విదేశీ సిగరెట్లు పలు అక్రమ మార్గాలలో మన దేశంలోకి చొరబడుతున్నాయని, వీటిని ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసినా భారీ పెనాల్టీ విధించటంతో పాటు, జైలుకు కూడా పంపిస్తామని ఆయన హెచ్చరించారు. సిగరెట్లు ధ్వంసం కార్యక్రమంలో డిఆర్ఐ, డీసీ సాహస సూర్య, కస్టమ్స్ ఏసీ అబ్దుల్ అజీమ్, కస్టమ్స్ సూపరింటెండెంట్లు కిషోర్, వివేక్, వేణుగోపాల్, నందిపాటి శ్రీనివాస్ చౌదరి ఇతర అధికారులు పాల్గొన్నారు.



విదేశీ సిగరెట్లను ధ్వంసం చేస్తున్న సిబ్బంది



ఇది సెల్ఫీ టైం..

యువకుడి క్లే ఆర్ట్

సందడి చేస్తున్న యువత

యువజన సంబరం

- కేరింతల మధ్య సంబరాలు
- నేటితో ముగియనున్న యువజనోత్సవాలు

పెదకాకాని, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): యువత విద్యలో మాత్రమే కాదు కళా రంగంలోనూ తమకు ప్రావీణ్యం ఉందని నిరూపించేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా నిలిచింది. యువ దినోత్సవంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉత్సాహంగా ఉల్లాసంగా విద్యార్థుల ప్రదర్శనలు సాగాయి. అబ్బురు పరిచే డాన్సులతో, విన్యాసాలతో మరోసారి కళాకారులుగా మారారు. స్కిట్ మైము ప్రదర్శనలపే విద్యార్థులు ఎంతో కష్టపడి చేశారు. విచిత్ర వేషధారణలతో, ఆకట్టుకునే విన్యాసాలతో గత కాలాన్ని గుర్తుచేసే సాంప్రదాయ పద్ధతిలో స్కిట్ లు చేశారు. మ్యూజిక్ విభాగంలో క్లాసికల్ వోకల్ సోలో (హిందుస్తానీ, కర్ణాటక), లైట్ ఓకల్ సోలో, గ్రూప్ సాంగ్స్, డిబేట్, క్విజ్ పోటీలు, ఫైనాన్స్ విభాగంలో కొల్లేజ్, క్లే మోడలింగ్, మెహందీ పోటీలలో మంచి ప్రదర్శనలు చేశారు. యువజన ఉత్సవాల నిర్వహణను కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళి మోహన్, అడిషనల్ కోఆర్డినేటర్ ఆచార్య పి జాన్సన్ పర్యవేక్షించారు.

నేటితో ముగింపు ..

మూడు రోజుల యువజన ఉత్సవాలు శనివారంతో ముగుస్తాయని కోఆర్డినేటర్ ఆచారి మురళి మోహన్ తెలిపారు. చివరి రోజు ఫోక్ ట్రైబల్ డాన్స్, స్కిట్స్ ఎలక్యూషన్ రంగోలి కార్ట్ బోనింగ్, స్పాట్ ఫోటోగ్రఫీ వంటి పోటీలను నిర్వహించనున్నారు.

విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా బిగ్ బాస్ ఫేమ్, హీరో సయ్యద్ సోహెల్ ర్యాన్, బిగ్ బాస్ ఫేమ్ శ్రీసత్య లు పాల్గొంటారని మురళీ మోహన్ తెలిపారు





డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

మంగళగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాటి కృష్ణారావు కుమారుడు శివ జన్మదినం సందర్భంగా శుక్రవా రం మంగళగిరి దేవస్థానం వద్ద యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ మన్నెం రమేష్‌బాబు, భగీరథ ట్రస్టు ఛైర్మన్ పందేటి సాంబశివరావు, ఏపీఎస్పీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వం నమోదు

తుళ్లూరు, అక్టోబరు 25: టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభవుతున్న నేపథ్యంలో తాడికొండ నియోజకవర్గ కార్యకర్తలు సభ్యత్వం నమోదు చేసుకోవాలని నియోజకవ ర్గ టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చంద్రశేఖర్(చందు) కోరారు. విలేకరులతో చందు మాట్లాడుతూ, తెలుగు దేశం పార్టీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు.

రేపు ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం

దుగ్గిరాల, అక్టోబరు 25 : దుగ్గిరాలలో పట్టభద్రుల ఓటునమోదు కార్యక్రమం ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు గ్రామ టీడీపీ నాయకులు తెలిపారు. గ్రామం లోని సెంట్రల్ వేర్‌హౌస్, జమ్మిచెట్టు సెంటర్, అలీనగర్, ఎఎల్ఈ చర్చి(పెద్దచర్చి) వద్ద ఏర్పాటు చేసిన శిబిరాల్లో జరిగిన ఓటు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

దుగ్గిరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అనుమతి పొందిన వారు మాత్రమే నిబంధనల పాటిస్తూ దీపావళి మందుగుండు సామగ్రి విక్రయించాలని ఎస్ఐ ఎస్.వెంకటరవి తెలిపారు. ప్రమాదాలకు అవకాశం లేకుండా ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మండలంలో లైసెన్సు కోరుతూ రేవేంద్రపాడు, దుగ్గిరాల, ఈమని, చిలువూరు గ్రామాల వారు మాత్రమే అనుమతులు తీసుకున్నారని తెలిపారు.

315 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 315 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ట ధర రూ.10,400, గరిష్ట ధర రూ.11,300, మోడల్‌ధర రూ.11,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ట ధర రూ.10,400, గరిష్ట ధర రూ.11,900, మోడల్ ధర రూ.11,000 పలికాయి.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి : తహసీల్దార్

పెదనందిపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శంకర్‌బాబు అన్నారు. మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో అందించాలని, నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించబడతాయని తెలిపారు. ఉప్పలపాడులో 19 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాహితీ, వీఆర్వో, ఉపసర్పంచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

3న వక్ఫ్ పరిరక్షణ మహాసభ

మంగళగిరి సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ పరిరక్షణ మహాసభ వచ్చే నెల 3వ తేదీన విజయవాడ కుమ్మరపాలెం ఈద్గా మైదానంలో జరుగుతుందని మహాసభ కన్వీనర్ సయ్యద్ లుఖ్మాన్ ఫార్ఖలీత్ తెలిపారు. మహాసభకు సంబంధించిన గోడప్రతులను మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ అజీమ్, ముహమ్మద్ యూసుఫ్, అబ్దుర్రషీద్ పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద పెరుగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 2 లక్షల 36 వేల 158 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటి పారుదల శాఖ జెఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 70 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2 లక్షల 20 వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 8,632 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 7,026 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాంకేతిక విద్యాబోధనపై దృష్టి సారించాలి : ఎంఈవో

కాకుమాను, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక విద్యా బోధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఆన్‌లైన్ పరికరాలను అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సాంకేతిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గేరా యేసోబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

పెదనందిపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పెదనందిపాడులో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. శుక్రవారం కోతుల దాడిలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతులు, కొండముచ్చులు, కుక్కలను పట్టించి వాటి బారి నుంచి కాపాడాలని ఈ సందర్భంగా గ్రామస్థులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా 'జగనన్న కాలనీలు'

- ఇంటి నిర్మాణాలు లేక దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు
- వర్షం వస్తే చెరువులను తలపిస్తున్న వైనం
- పేకాట, మందుబాబులతో కాలనీలు



పొన్నెకల్లులో జగనన్న కాలనీలో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు

తాడికొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడంతో లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్దిదారులు వాటి నిర్మాణాలకు విముఖత చూపుతున్నారు. తాడికొండ మండలంలో 1861 మందికి జగనన్న కాలనీలలో నాడు స్థలాలను మంజూరు చేశారు. వారిలో 1383 మంది ఇళ్ల నిర్మాణానికి మొగ్గుచూపగా, 419 మంది లబ్దిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల సంఖ్య 964 కాగా, ఇంకొన్ని చోట్ల నిర్మాణం ప్రారం భించి వదిలిపెట్టారు. పొన్నెకల్లులో రెండు చోట్ల స్థలాలను కేటాయించి లబ్దిదారులకు స్థలాలు పంపిణీ చేశారు. గ్రామానికి దూరంగా ఇచ్చిన ఈ స్థలాల్లో కేవలం పది ఇళ్లను మాత్రమే నిర్మించారు. కాలనీ మొత్తం పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. ఇది ఊరికి దూరంగా ఉండటంతో మందుబాబులు, పేకాటరాయుళ్లకు అడ్డాగా మారిపోయింది. అంతేకుండా గత ప్రభు త్వం రూ. 1.80 లక్షలు ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వగా అవి సరిపోవనే ఉద్దేశ్యంతో లబ్దిదారులు పూర్తిస్థాయిలో ప్రారంభించలేదు. తాడికొండ శివారు బడేపురంలో సుమారు 725 మందికి ఇళ్ల పట్టాలను 2022 జూలైలో లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు ఏ ఒక్క లబ్దిదారుడూ అక్కడ శంకుస్థాపన చేయలేదు. ఇళ్ల స్థలాలను చాలా మంది అమ్ముకున్నారు. బడేపురం లేఅవుట్‌లో రూ. 80 వేలు, రూ. లక్షల, రూ.1.50 లక్షల వరకు స్థలాలను విక్రయించారు. కాలనీకి నిర్మాణ సామాగ్రిని తరలించేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో లబ్దిదారులు నిర్మాణాలు చేపట్టడం లేదు.



బడేపురంలో జగనన్న కాలనీలో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రత్తిపాడులో పశుగణన ప్రారంభం



సిబ్బందికి పశుగణన మెటీరియల్‌ను అందజేస్తున్న గింజుపల్లి శివరామప్రసాద్

ప్రత్తిపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 16 రకాల పెంపుడు జంతువులపై జాతీయ స్థాయిలో చేపట్టిన పశుగణన కార్యక్రమాన్ని ప్రత్తిపాడు మండలంలో శుక్రవారం ప్రారంభించారు. ప్రత్తిపాడు పశువైద్యశాలలో ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ ప్రారంభించారు. పశుగణన నిర్వహించే సిబ్బందికి మెటీరియల్‌ను అందజేయడంతో పాటు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గొట్టిపాడు పశువైద్యశాఖాధికారి డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ తమ సిబ్బంది ప్రతి కుటుంబానికి వెళ్లి అన్ని రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సేకరించడం జరుగుతుందన్నారు. ఈ పశుగణన ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసు పెంటారెడ్డి, కాకాని సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నాగులపాడులో..

పెదనందిపాడు, అక్టోబరు,25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోకి పశువైద్యాధికారులు వచ్చినప్పుడు పశువుల సమగ్ర సమచారాన్ని అందించాలని సర్పంచ్ పాలపర్తి శ్రీలక్ష్మీ అన్నారు. మండల పరిధిలోని నాగులపాడులో 21వ అఖిల భారత పశుగణన గోడపత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. పశువైద్య సిబ్బంది నాలుగు రోజులపాటు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సిబ్బంది ఆయా లబ్దిదారుల వద్దకు వచ్చి పశుపక్షుల సమాచారాం సేకరించడం జరుగుతుందని దీని ద్వారా పశుగణన రంగ పథకాలు రూపకల్పనకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బండి నాగబాబు, ఆళ్ళ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి పారిశ్రామికవేత్తల తోడ్పాటు అవసరం

- శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు



ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజును కలిసిన శాప్ ఛైర్మన్ రవి నాయుడు

మంగళగిరి సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడా రంగం అభివృద్ధికి పారిశ్రామికవేత్తల తోడ్పాటు అవసరమని, ఆ దిశగా ఏపీఐఐసీ సహకరించాలని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు కోరారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజును శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు కూడా సహాయ సహకారాలను అందిస్తే క్రీడా రంగంలో సత్ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. రామరాజు మాట్లాడుతూ క్రీడా రంగంలో పీపీపీ విధానాన్ని అమలు చేయడం మంచి నిర్ణయమన్నారు. క్రీడా రంగం అభివృద్ధికి ఏపీఐఐసీ తరపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే చక్కటి వేదిక



రైతుల సమస్యలను వింటున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్

తుళ్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):: రైతు సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక గ్రీవెన్స్ డే అని ఏపీ సీఆర్డీ అదనపు కమిషనర్ జీ.సూర్యసాయి ప్రవీణ్ చంద్ అన్నారు. తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం రైతుల అర్జీలను స్వీకరించారు. రైతులు అధిక సంఖ్యలో తమ సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలను గ్రీవెన్స్‌లో ఉన్న వివిధ విభాగాల అధికారులకు పరిష్కారం చేయాలని ఆయన ఆదేశించారు. ప్రతి శుక్రవారం పది గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు గ్రీవెన్స్ డే జరుగుతుందని చెప్పారు. అమరావతిలో భూమి వ్యవహారాలు-112, ప్రణాళికా విభాగానికి-3. సోషల్ డెవలప్‌మెంట్‌కి -1, భూమి సర్వేకి-1 అర్జీ వచ్చాయి. కార్యక్రమంలో సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు విశ్వేశ్వరనాయుడు, స్వర్ణమేరి, సాయిశ్రీనివాస్ నాయక్, భీమారావు, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిలువూరు ముస్లిం కాలనీలో డ్రైనేజి నిర్మాణానికి భూమిపూజ



శంకుస్థాపనలో పాల్గొన్న ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ మాణిక్యం, ఎంపీటీసీ రోజమరియమ్మ

దుగ్గిరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంత్రి నారా లోకేశ్ చొరవతో అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టడం జరుగుతోందని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. మండల గ్రామం చిలువూరులో డ్రైనేజి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో స్థానిక మసీదు సమీపంలో ముస్లింబజార్‌లో మురుగుకాల్వ నిర్మాణానికి నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ చిలువూరు రోజమరియమ్మ భూమిపూజ నిర్వహించారు. ఎంపీపీ జబీన్ మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ఆదేశాలతో మండలంలో జాతీయ ఉపాధి పథకం కింద రూ.3 కోట్ల 36 లక్షలతో పలు గ్రామాల్లో డొంకరోడ్లు, కల్వర్టులు, అంతర్గత సీసీరోడ్లకు భూమి పూజ జరిపామన్నారు. ముస్లింలు ఎంతకాలంగా డ్రైనేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, మొత్తం 260 మీటర్ల పొడవున నిర్మించనున్న మురుగుకాల్వతో ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శరత్‌బాబు, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, గ్రామాధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, నూరుద్దీన్, చిలువూరు శేషగిరి, మేళం ఆనంద్, బాజి, లిఖత్‌అలీ, పలువురు మైనార్టీ పెద్దలు, టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిని బెదిరించిన ఘటనపై కేసు నమోదు

దుగ్గిరాల, అక్టోబరు 25 : ఈమనిలో సినిమాఫక్కీలో సైబర్ నేరగాళ్ల పన్నిన ఉచ్చులోపడి తన ఖాతాలో నగదు పోగొట్టుకున్న ఘటనపై దుగ్గిరాల పోలీసులకు బాధితుడు శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ముదిగొండ వంశీజ్వాలా రామలింగేశ్వర్, గత నెల 24, 25 తేదీల్లో గుర్తు తెలియని వ్యక్తులు తనను ఫోన్‌కాల్ ద్వారా బెదిరించి 19 లక్షల 83 వేలు తన బ్యాంకు ఖాతాల నుంచి మాయం చేసినట్లు తొలుత గుంటూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నేటివరకూ నగదు రికవరీపై ఎలాంటి పరిష్కారం లభించలేదు. కాగా శుక్రవారం సాయంత్రం మరో మారు దుగ్గిరాల పోలీసులకు బాధితుడు వంశీ ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తూ గతనెల 24న స్వగ్రామం ఈమనికి వచ్చాడు. కాగా మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాము సైబర్ పోలీసులమని, వంశీకి ఫోన్‌చేసి, అతని ఆధార్ కార్డు నెంబరుతో నాలుగుబ్యాంకుల్లో రుణాలు తీసుకుని చెల్లించలేదని, ముందుగా వాటిని చెల్లించకుంటే మనీలాండరింగ్, ఐడెంటిటీ తెఫ్ట్ కేసులు పెట్టి అరెస్టు చేస్తామని బెదిరించారు. భయాందోళనకు గురైన వంశీ నేరగాళ్లు చెప్పిన విధంగా ఐదు విడతలుగా రూ.5 లక్షల చొప్పున రెండు పర్యాయాలు, రూ.1.98 లక్షలు, రూ.5.16 లక్షలు, రూ.98,110, రూ.1.99లక్షలు, రూ.1.70లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసిన వెంటనే కాల్ కట్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. వెంకటరవి తెలిపారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

మంగళగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో స్థానిక టీడీపీ నేతలు శుక్రవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. మంగళగిరిలోని 18వ వార్డుకు చెందిన ఉప్పాల మల్లేశ్వరికి రూ.లక్షా 60 వేలు, తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన జొన్నా హరితకు రూ.లక్షా 5 వేల చొప్పున విడుదలైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మాజీ కౌన్సిలర్ దామర్ల పద్మజ, నేతలు చిరంజీవి, రాంబాబు, అందె మురళీ, గాదె వినయ్, శనకా బుజ్జి, కూనపురెడ్డి రమేష్, బాబు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నేత జేవీ రాఘవులు డిమాండ్ చేశారు. రెండు నెలల వేతనాలు చెల్లించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, నేతలు రవి, మణి, నాని, సతీశ్, శివ, యోహాన్, ఆర్.కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కార్మికులకు హామీ ఇచ్చారు. సిమెంటు ఫ్యాక్టరీ యూనియన్ ఆఫీస్ వద్ద బ్రహ్మానందపురంలో యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న కార్మిక వర్గం మొత్తం ఏసిసి సిమెంటు ఫ్యాక్టరీ భూముల్లోకి దిగి స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, గాదె సుబ్బారెడ్డి, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

మంగళగిరి సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా వుండే ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఏపీఎస్పీ బెటాలియన్స్ ఇన్‌చార్జి అడిషనల్ డీజీ సీహెచ్ శ్రీకాంత్ పిలుపు నిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళగిరి ఏపీఎస్పీ ఆరవ పటాలంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏడీజీ శ్రీకాంత్‌తోపాటు ఇతర అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ బి.రాజకుమారి, కమాండెంట్ కే.నగేష్‌బాబు, అడిషన ల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు

తాడికొండ,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సును శుక్రవారం మంగళగిరి సహ వ్యవసాయ సంచాలకులు జేఎస్ఎం పుణ్యవతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 'ఎరువుల యాజమాన్యం, నేల ఆరోగ్య పరిరక్షణ' అనే అంశాలపై అవగాహన కల్పించ నున్నట్లు చెప్పారు. శాస్త్రవేత్తలు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.వెంకట రాములు, ఏరు వాక కేంద్రం సమన్వయకర్త ఎన్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

తుళ్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐన చెరువు కాలనీలో శుక్రవారం పోలేరమ్మ అమ్మవారి విగ్ర హ ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. యంత్ర ప్రతిష్ఠ చేసి నూతన ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్తుల సహకారంతో నూతన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని భక్త కమిటీ నిర్వహించింది. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మున్సిపల్ పరిధిలోని నవోదయ కాలనీ క్రిస్టియన్ పేట, వీఆర్ అపార్టుమెంట్ ఏరియాలో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ సురేష్‌బాబు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా జరగాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఇంజినీరింగ్, ప్రజారోగ్య, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించిన 8 వార్డులు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నాయని, వాటిలో ప్రజలకు తక్షణం మౌళిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గోరంట్ల కొండ మీద సాగుతున్న రిజర్వాయర్ నిర్మాణ కాంట్రాక్టర్‌ని పిలిచి పనులను వేగంగా చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపాలని, రిజర్వాయర్ పూర్తయితే అనేక ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ రెవెన్యూ వసూళ్ళలో నిర్లక్ష్యం వద్దని, పాత బకాయిలు ఎందుకు పెండింగ్ లో ఉంటున్నాయని ప్రశ్నించారు. పట్టణ ప్రణాళిక విభాగ సమీక్షలో అధికారులతో మాట్లాడుతూ నగర పరిధిలో అనధికార వెంచర్లు పెరుగుతున్నాయని, పట్టణ ప్రణాళిక అధికారులు వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఎస్.బాలాజీ, వైపద్మావతి, డి.లక్ష్మీ దుర్గ, అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, సిటి ప్లానర్ రాంబాబు, ఈఈలు, ఎంహెచ్ఓలు, డీసీపీ, ఏసీపీ, ఆర్‌వోలు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

ప్రాణాల రక్షణలో రక్తదానం కీలకపాత్ర

- కేఎల్‌యూ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్



రక్తదాతలకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న చిత్రం

తాడేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరాలు, కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో రక్తదానంపై ఉన్నతమైన అవగాహన పెరుగుతోందని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటి విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం వర్సిటీలోని శాక్ హాల్‌లో అమెరికన్ క్యాన్సర్ కేర్ బ్లడ్ బ్యాంక్, కెఎల్‌యూ యూత్ రెడ్ క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆయన విద్యార్థులకు రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. ఒక్కసారైన మనం రక్తం ఇచ్చి ఎందరో ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. రక్తదాన శిబిరంలో సుమారు 200 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు ఆయన తెలిపారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. వర్సిటి వీసీ డాక్టర్ సారథివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఇంజ నీరింగ్ కళాశాల పరీక్షల విభాగం ముఖ్య పర్యవేక్షణాధికారి డాక్టర్ సోమ్‌లాల్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, గుంటూరు జిల్లా బ్లడ్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.కె. జానీ రసూల్, మురళీమోహన్, డాక్టర్ సుప్రియ, డాక్టర్ సుభాకర్‌రాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సిబ్బందిని, రక్తదాతలను అభినందించారు.

పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి : మాజీ ఎంపీపీ

పెదనందిపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రం పెదనందిపాడులో శుక్రవారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆదేశాల మేరకు మండల టీడీపీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని బాలకృష్ణ ప్రారంభించి మాట్లాడుతూ పట్టభద్రులంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకొని ఎన్డీయే కూటమి అభ్యర్థి అయిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలిరోజు 60 మంది ఓటు హక్కుకు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు చాగంటి సత్యహర్ష, టీడీపీ సీనియర్ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, పోపూరి లక్ష్మీనారాయణ, నల్లపునేని శివప్రసాద్, పాటిబండ్ల మురళీ, మోపర్తి చెంచయ్య పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువలో రైతు గల్లంతు

తెనాలి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు కొమ్మమూరు కాలువలో రైతు గల్లంతయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరరావు తెలిపారు. కొలకలూరు గ్రామానికి చెందిన రైతు గమిడిఏడుకొండలు (58) శుక్రవారం సైకిల్‌పై ఎరువుల బస్తాలను తీసుకుని పొలం వెళుతూ ప్రమాదవశాస్తూ కాలువలోకి పడి గల్లంతయ్యాడు. దీనిపై అతడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎరుకులపూడిలో పశువైద్య శిబిరం

తెనాలి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకలపూడిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ పశుగ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశుగ్రామీణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.బాలశంకర్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి పాల్గొని పశువులకు పరీక్షలు జరిపి పశుపోషకులకు గర్భకోశ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ఖనిజ లవణ మిశ్రమాన్ని, ఇతర మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి పసుపులేటి సామ్రాజ్యం ముఖ్య అతిథిగా హాజరై ప్రారభించారు. గ్రామ పెద్దలు పసుపులేటి మురళీకృష్ణ, చందు శాంతకుమార్, పశువైద్యులు డాక్టర్ బసవ పున్నయ్య, డాక్టర్ పాలపర్తి శ్రీనివాసరావు, డాక్టర్ డి. మీనాక్షి, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వర్తక వాణిజ్య సంఘాలు ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న వివరాలు తెలుపుతూ ఎంఎస్ఎంఈల పనితీరును మెరుగు పర్చడానికి, అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రపంచ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ (ఆర్ఏఎంపీ)అనే పథకాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఈ పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రవేశ పెట్టారన్నారు. ఈ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా తెనాలి పురపాలక సంఘం నుంచి నమోదు చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. పట్టణంలోని అన్ని ఎంఎస్ఎంఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు వర్తక వాణిజ్య సంఘాలు, సచివాలయ సర్వే టీంలకు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలను అందించి విజయవంతం చేయాలని కోరారు.

కాలువల్లో వ్యర్థాలను తొలగించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలోని వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులకు సూచించారు. పట్టణంలోని 27, 28వ వార్డులో శుక్రవారం పురపాలక సంఘ కమిషనర్ శేషన్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పంట కాలువ వెంట పెరిగిన పిచ్చి చెట్లను తొలగించాలని సూచించారు. పంట కాలువల్లో నీటి పారుదలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, అందులోని వ్యర్థాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 32వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ పండుగ

పొన్నూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ఐదో వార్డు డఫ్‌పేటలో శుక్రవారం గ్యార్మీ పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముస్లిం యూత్ ఆధ్వర్యంలో గ్యార్మీ పండుగ సందర్భంగా జెండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జెండా మహోత్సవం సందర్భంగా పట్టణంలోని మసీద్ నుంచి జెండా చెట్టు వద్ద వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా రూపొందించిన మసీద్ నమూనా ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. జెండా చెట్టు వద్ద జెండాను అలంకరించి గం ధాన్ని సమర్పించారు. ముస్లిం యూత్ ఆధ్వర్యంలో 2500మందికి అన్నదానం చేశారు.

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలి

● విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ నాగభూషణం

కొల్లిపర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన పరిజ్ఞానంతో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.నాగభూషణం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం, కొల్లిపర గ్రామాల్లో ఆయన పర్యటించి పలురకాల పంటలను పరిశీలించారు. రైతులు పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కొల్లిపరలో శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి నమూనా పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ రమేష్‌బాబు, శాస్త్రవేత్తలు డాక్టర్ టి. నరేష్, డాక్టర్ హరీష్, డాక్టర్ అనూష, రైతులు నెర్ల కుటుంబరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉయ్యూరు సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను తయారు చేయాలి: తహసీల్దార్

కొల్లిపర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను తయారు చేయాలని తహసీల్దార్ సిద్దార్థ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్‌లతో ఆయన ఓటర్ల జాబితాపై సమీక్షించారు. ఓటర్ల జాబితా తయారుపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్దార్థ మాట్లాడుతూ రైతుల సర్వే నంబర్లు, టీసీల వారీగా ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. రైతుల దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు.

వీధి కుక్కలపై నియంత్రణ ఏదీ?



వీధులలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

● వీధుల్లో కుక్కల స్వైరవిహారం

● ప్రతి రోజు ఏదో ఒక చోట కుక్కకాట్లు

● కుక్కల సంతతి పెరుగుతున్నా పురపాలక సంఘం చర్యలు శూన్యం

● కేంద్రసహాయ మంత్రి సూచించినా మారని అధికారుల తీరు

తెనాలి మారీసుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ రోడ్లవెంబడి వెళ్లే పాదచారులను గాయపరుస్తున్నాయి. కుక్క కాటుకు సకాలంలో వైద్యసేవలు పొందకపోతే ప్రాణాలమీదకు వస్తుందన్న భయంతో ఉరుకులు పరుగుల మీద వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. తల్లిదండ్రులు వీధుల్లో కుక్కల గుంపులతో పిల్లలను బయటకు పంపేందుకు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలకు ప్రశాంత వాతావరణం నెలకొల్పాల్సిన పురపాలక సంఘం కూడా కుక్కల నియంత్రణ విషయంలో ఉదాశీనంగా వ్యవహరిస్తుండటంతో రోజు రోజుకు వాటి సంతతి పెరిగిపోతోంది. కుక్కకాటుకు గురవుతున్నామని పలువురు మునిసిపల్ కార్యాలయం దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదు. దీనిపై గతంలో సాక్షాత్తూ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి కుక్కల బెడదపై పురప్రజలు ప్రస్తావించగా ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఐతే కేంద్ర సహాయ మంత్రి ఆదేశాలు సైతం నేటికి అమల్లోకి రాకపోవడంతో ప్రజలు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర సహాయ మంత్రి చెప్పినా మునిసిపల్ అధికారుల్లో చలనం లేకపోతే ఇక సామాన్యుల ఫిర్యాదులపై ఏవిధంగా పరిష్కారం చూపుతారంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. నిత్యం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు కుక్కకాటు కేసులు వస్తూనే ఉన్నా అధికారులకు మాత్రం వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్న ఆలోచనకూడా లేకపోవడం శోచనీయం. వీధుల్లో కుక్కలను చూస్తేనే భయం భయంగా తిరగాల్సిన పరిస్థితి. మారీసుపేట మఠంబజారుకు చెందిన బ్రహ్మం తన పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో కుక్కల గుంపు తనపై దాడిచేసి గాయపరిచాయని వాపోయారు. యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో తీసుకున్నాని తెలిపారు. సాయంత్రం గం.7 దాటితే వీధులలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పాదచారులను, ద్విచక్ర వాహనదురులపై దాడులు చేస్తున్నాయని వాపోయారు. పురపాలక సంఘ పరిధిలో కుక్కల సంతతిని అదుపుచేసేందుకు శస్త్రచికిత్సల కేంద్రం ఉంది. కాగా వాటిల్లో పనిచేసే సిబ్బందిని నియమించకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. వీధుల్లో జనాభా కంటే కుక్కల సంతతి పెరగకముందే అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకుంటే పట్టణంలో మరిన్ని కుక్కకాట్లు జరిగే ప్రమాదం ఉంది. అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు కోరుతున్నారు.



బ్రహ్మం

పేదల కోసం ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

తెనాలి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి బాధలు తీర్చేందుకు వారి అభ్యున్నతి కోసం టీడీపీ ఆవిర్భవించిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్వీఆర్ కన్వెన్షన్ హాల్లో తెనాలి నియోజవర్గ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నియోజవర్గ వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సాధారణ సభ్యత్వానికి రూ.99 చెల్లిస్తే దాని ద్వారా ఆ సభ్యుడు అనివార్య కారణాల వల్ల ప్రమాదం ఏర్పడి ప్రాణాలు కోల్పోతే రూ.5లక్షలు ఇన్సూరెన్స్ లభిస్తుందన్నారు. సహజ మరణానికి తక్షణ సాయంకింద పదివేలు రూపాయలు మట్టిఖర్చుల నిమిత్తం వస్తుందన్నారు. రూ.1 లక్ష చెల్లిస్తే పార్టీ శాశ్వత సభ్యత్వం లభిస్తుందన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నియోజవర్గంలో రూ.40వేల సభ్యత్వాలు ఉన్నాయని, ఈ దఫా 80 వేలకు చేరేలా పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనకు అవకాశం ఇచ్చారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గంలో పట్టభద్రుల ఓట్ల నమోదుపై ప్రజల్లో అవగాహన పెంచి వారికి ఓటు హక్కు కలిగి ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక భారతంలో యువత పాత్ర కీలకం

● అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్

● ఘనంగా ముగిసిన కాశ్మీరీ యువ సమ్మేళనం



కాశ్మీరీ యువ సమ్మేళనలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్

పెదకాకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక భారతంలో యువత పాత్ర కీలకం అని గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఆరు రోజులపాటు జరిగిన నాలుగవ కాశ్మీర్ యూత్ ఎక్సేంజ్ కార్యక్రమంలో డా.వేణుగోపాల రెడ్డి సెమినార్‌హాల్‌లో శుక్రవారం ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో కాశ్మీర్‌లోని 6 జిల్లాలైన పుల్వామా, బుద్గామ్, శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా, అనంతనాగ్ నుంచి మొత్తం 132మంది యువతీ యువకులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్ననిల్ పవార్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యకలాపాలు, నైపుణ్య అభివృద్ధి, విద్య, ఉపాధి కలిగించే అవకాశాలపై దృష్టి సారించి దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాంకేతిక, పారిశ్రామిక పురోగతికి కాశ్మీర్ యువతకు పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే గంగాధరావు మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో భాగమైన వివిధ అంశాలపై కార్యశాలలు, క్షేత్రస్థాయి సందర్శనల ద్వారా కాశ్మీరీ యువతకు జాతీయ ఐక్యత, సమగ్రత, శాంతి ప్రతిపాదకులుగా యువతీ, యువకులు వ్యవహరించేలా చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎన్నికైన నెహ్రూ యువ కేంద్రాలలో గత నాలుగు సంవత్సరాలుగా కాశ్మీరీ యువ సమ్మేళనం కార్యక్రమం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, కాశ్మీర్ యువకులలో జాతీయ ఐక్యత, సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నదని, అలాగే కాశ్మీరీ యువతకు ఇక్కడ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లతో సహా, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి యువ సమ్మేళనంలో తెలియజేసే అవకాశం దొరికిందన్నారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి సహకరించిన ప్రతి డిపార్ట్మెంటుకు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగ వలంటీర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దివ్యతేజోమూర్తి, కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్ర వైజాగ్ జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్ర చిత్తూర్ జిల్లా యువ అధికారి ప్రదీప్ బెహరా గౌరవ అతిథులుగా హాజరై ప్రసంగించగా, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా జరిగింది. కాశ్మీర్ నుంచి హాజరైన ప్రతి ఒక్కరికి పార్టిసిపెంట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగ వలంటీర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద మహిళల అభ్యున్నతికి మెప్మా ప్రత్యేక కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



స్టాల్స్‌లోని ఉత్పత్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేద మహిళల అభ్యున్నతికి మెప్మా ద్వారా పురపాలక సంఘం ప్రత్యేక కృషి చేస్తున్నదని పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయం ఎదుట శుక్రవారం పట్టణ పురపాలక సంఘ మెప్మా అధికారులు స్వయం సహాయక సంఘం సభ్యులతో మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్ భరత్ ఆదేశాల మేరకు పురపాలక సంఘ మెప్మా అధికారులు స్వయం సహాయక సంఘ సభ్యులచే మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. పేదరిక నిర్మూలన కోసం మహిళలను స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇంటి వద్దే ఉత్పత్తులను తయారు చేసుకునే ఏర్పాటు చేశామన్నారు. వారు తయారుచేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు ఈ స్టాల్స్ ఉపయోగపడతాయని చెప్పారు. స్వయం సహాయక సంఘ సభ్యులు లాభాపేక్ష లేకుండా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని గ్రూప్ సభ్యుల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి నెలలో రెండు రోజులు ఈ అర్బన్ మార్కెట్‌లను నిర్వహిస్తామని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించి తమకు కావాల్సిన వాటిని కొనుగోలు చేశారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ మేనేజర్ చండి దేవసేన, మెప్మా సీఎంఎం జి.విజయకుమారి, మెప్మా సీవో, ఆర్‌పీలు స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



టెడ్-ఎక్స్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

స్ఫూర్తిని నింపిన 'టెడ్-ఎక్స్ వీవీఐటీ'

పెదకాకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వీవీఐటీ విద్యార్థులతో నిర్వహించిన 'టెడ్-ఎక్స్ వీవీఐటీ' విద్యార్థులలో స్ఫూర్తిని నింపి, ప్రేరణ కలిగించేలా సాగింది. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు వాటిని అధిగమించి ఏవిధంగా ముందుకు సాగాలో తెలియజేస్తూ వక్తలు శుక్రవారం ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన 9మంది వక్తలు వారి జీవితానుభవాలను తెలిపి, వారు అధిగమించిన సవాళ్లను విద్యార్థులకు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పలు అంశాలపై అవగాహన కలిగించి క్లిష్ట సమయాలలో సరైన మార్గాలు ఎన్నుకునేలా విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. కార్యక్రమంలో వక్తలుగా సినీ దర్శకుడు విద్యాధర్ కటిగ, లెంత్రా చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ వికాస్ మెథోక్, ప్రముఖ న్యూరోసర్జన్ శివానంద్‌రెడ్డి, శాంసంగ్ సీనియర్ స్టాఫ్ ఇంజనీర్ శౌఘత భట్టాచర్జీ, ఫారెన్సిక్ ప్రొఫెషనల్ త్రిషితా చటర్జీ, పర్యావరణవేత్త, ప్రొఫెసర్, అజయ్ కాట్రగడ్డ, వీవీఐటీ విద్యార్థులు సువిధ, భరత్‌లు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి: కొండపల్లి

చేబ్రోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాల నిరోధానికి కృషి చేస్తున్నట్లు లాంప్ సంస్థ కో ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గొడవర్రులో శుక్రవారం మైచాయిస్ ఫౌండేషన్, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధం, మానవ అక్రమ రవాణా, గృహహింస నేరాలపై అవగాహన కల్పించారు. ఈ మూడు సమస్యలు లేని గ్రామాలు సురక్షిత గ్రామాలుగా తెలిపారు. విద్యార్థి దశ నుంచే మానవ అక్రమ రవాణాపై అవగాహన అవసరం అన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవిత లక్ష్యాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా బాలికలు అక్రమ రవాణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంపై సురక్షిత గ్రామజ్యోతిపై ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో షేక్ బాజీ, పీకే స్నేహలత, షేక్ మాలిని, కె.సుధారాణి, దేవి, పి.నాగమల్లేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ప్యారీ పాల్గొన్నారు.



అవగాహన కరపత్రాలు ప్రదర్శిస్తున్న గొడవర్రు గ్రామస్తులు

తెనాలి పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం

● పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు

ఫటాఫట్



తెనాలి, మారీసుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పడానికి పురపాలక సంఘ అధికారులు సిబ్బంది పనిచేస్తున్నారని మున్సిపల్ అసిస్టెంటు కమీషనర్ లక్ష్మీపతిరావు చెప్పారు. అంధ్రజ్యోతి ప్రతినిధితో శుక్రవారం పలు అంశాలపై ఫటాఫట్..

పారిశుధ్యం మెరుగు పరిచేందుకుఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

అసిస్టెంటు కమిషనర్: ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వీధుల వెంబడి పారశుధ్య సిబ్బందిని పంపి ఇంటి నుండి, వీధులలో ఉన్న చెత్తను, వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం.

ఖాళీ స్థలాల్లో అపరిశుభ్ర వాతావరణంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఖాళీ స్థల యజమానులకు నోటీసులిస్తున్నాం. నోటీసులకు కొందరు స్పందిస్తుండగా మరికొందరు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆలోచనల మేరకు ఖాళీ స్థలాలను శుభ్రంచేసి అందుకు అయ్యే ఖర్చును ఖాళీస్థల యజమానుల నుంచి వసూలు చేస్తాం.

దోమల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ప్రతిరోజు పట్టణంలో ఫాగింగ్ చేయటం, నీరు నిల్వలు లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇంటిలోని చెత్తను, వ్యర్థాలను పారిశుధ్య కార్మికులకు అందించేలా అవగాహన కల్పిస్తున్నాం.

ప్లాస్టిక్ నియంత్రణపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ప్లాస్టిక్ వాడకం వలన వచ్చే అనర్థాల మీద ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే సత్ఫలితాలు వస్తాయి.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కఠెవరం శివారు కాలనీలో పారిశుధ్య పనులు మెరుగుపరుస్తున్న కార్మికులు

తెనాలి రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'కఠెవరం పంచాయతీలో అధ్వాన పారిశుధ్యం' కథనం గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. గ్రామ శివారు కాలనీలో నీరు నిలిచి ఉన్న ప్రదేశాన్ని పరిశీలించి పారిశుధ్య కార్మికులతో వాటిని బయటకు పంపే పనులు చేపట్టారు. గ్రామంలో పలు వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. జిల్లా నుంచి మలేరియా అధికారులు గ్రామాన్ని సందర్శించి అపరిశుభ్ర వాతావరణం ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలకు యంత్రాగాన్ని ఆదేశించారు. తమ సమస్య పరిష్కారమయ్యేందుకు కృషిచేసిన ఆంధ్రజ్యోతిని పలువురు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



డీవీసీ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ రమేష్‌బాబు

వ్యర్థాలను డ్రెయిన్లలో వేయవద్దు: కమిషనర్

పొన్నూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను డ్రెయిన్లలో పడవేయవద్దని పట్టణ వాసులను మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు కోరారు. పట్టణంలోని డీవీసీ కాలనీలో శుక్రవారం కమిషనర్ రమేష్‌బాబు పర్యటించారు. స్థానిక మహిళలను కలుసుకుని కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రహదారులు, డ్రెయిన్లలో ఉన్న చెత్త, వ్యర్థాలను పరిశీలించి శుభ్రం చేయించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో నీటిని మళ్లించి బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ మహిళలు తమ గృహాల్లో వచ్చే వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. డ్రెయిన్లలో వ్యర్థాలను పడవేయటం వల్ల డ్రెయిన్లలో సిల్ట్ పెరిగి నీటి ప్రవాహాలకు అడ్డుగా ఉంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైన వేజండ్ల విద్యార్థులు

జాతీయ వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థుల ఎంపిక

చేబ్రోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు వేజండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి విజయశ్రీ తెలిపారు. శుక్రవారం పాఠశాల్లో విద్యార్థుల అభినంద కార్యక్రమం జరిగింది. ఈ నెల 21 నుంచి 23వరకు సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ - 17 వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పాఠశాలకు చెందిన మట్టుపల్లి సుమశ్రీ, మట్టుపల్లి జయ సంజనా, పఠాన్ సాహెదా, ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులు నవంబరు 4 నుంచి 9వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. విద్యార్థులను పాఠశాల పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

టీడీపీ సీనియర్ నేత యేమినేని మృతి

పొన్నూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతరామపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు యేమినేని రామారావు శుక్రవారం మృతి చెందాడు. రామారావు మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రామారావు కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు తదితర టీడీపీ నాయకులు రామారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



మాచవరంలో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ శివ శంకర్

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి

● డ్వామా పీడీ శివశంకర్

పొన్నూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పల్లె పండుగ కార్యక్రమానికి మంజూరైన పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని డ్వామా పీడీ శివశంకర్ అన్నారు. మండల పరిధిలోని పెద్దపాలెం మాచవరం, పచ్చలతాడిపర్రు గ్రామాల్లో శుక్రవారం జిల్లా నీటి యాజమాన్య ప్రాజెక్టు డైరెక్టర్ శివశంకర్ పర్యటించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరై నిర్మాణం ప్రారంభించిన సిమెంట్ రోడ్లను తనిఖీచేశారు. పెద్దపాలెంలో అమృత్ సరోవర్ ట్యాంక్, పచ్చలతాడిపర్రులో హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ శివశంకర్ మాట్లాడుతూ పల్లెపండుగ ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం వంటి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. మొదటి దశ పనులు పూర్తయిన తర్వాత గ్రామసభలో ప్రతిపాదించిన మిగిలిన పనులను రెండో దశలో ప్రారంభించనునట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పనుల పథకం సిబ్బంది. గ్రామస్థులు పాల్గొన్నారు.